



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 83 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 16 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## ఢిల్లీలో తీవ్ర పొగమంచు

### ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనలో జాప్యం

**విశ్వం వాయిస్ :** ఢిల్లీలో తీవ్రమైన పొగమంచు కారణంగా ప్రధాని నరేంద్ర మోదీ మూడు దేశాల పర్యటనలో జాప్యం నెలకొంది. జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల పర్యటనకు సోమవారం ఉదయం 8.30 గంటలకు ప్రధాని మోదీ బయల్దేరాల్సి ఉంది. అయితే దిల్లీ విమానాశ్రయంలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో ప్రధాని విమానం ఆలస్యమయి నట్లు జాతీయ మీడియా మిగతా .. 2లో..

## కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ



### నైపుణ్య గణనకి సహకారం అందించాలని కోరిన లోకేష్

**ఢిల్లీ, విశ్వం వాయిస్ :** కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్టవ్ తో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులపై చర్చించారు. రాష్ట్రంలో నైపుణ్య గణన కోసం అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో రూపొందించిన నైపుణ్యం పోర్టల్ గురించి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు వివరించారు. మంగళగిరి లో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్ట్, అందులో ఎదుర్కున్న సమస్యలు అధిగమించడానికి మిగతా .. 2లో..



### తెలుగుజాతి గుర్తింపు కోసం

## పోరాడిన వ్యక్తి పొట్టి శ్రీరాములు

### అమరజీవి ఆత్మార్పణ సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుజాతి గుర్తింపు కోసం పోరాడిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు పోరాటం చేశారన్నారు. " తన పోరాటంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. 1952లో మద్రాస్‌లోని బలుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి చనిపోయారు. నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడి ప్రాణత్యాగం చేశారు. ఆయన మృతితో తెలుగు తమ్ముళ్లు బయటకు వచ్చి పోరాడారు. దీంతో తెలుగువాళ్లకు ప్రత్యేక రాష్ట్రం ఇస్తామని అప్పటి ప్రధాని ప్రకటించారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన రోజును స్మరించుకుంటున్నాం. త్యాగం చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులను గౌరవించుకోవడం మన సంప్రదాయం. అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం 6.8 ఎకరాలు కేటాయించాం. 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచిన భవనాన్ని స్మారక కేంద్రంగా మారుస్తాం. పొట్టి శ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు.. తెలుగు ప్రజల ఆస్తి" అని చంద్రబాబు అన్నారు.



### నరసాపురం-చెన్నై

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



**నరసాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నరసాపురం- చెన్నై వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. నరసాపురం స్టేషన్ నుంచి కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసభాపతి రఘురామకృష్ణ రాజు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి, ఇతర అధికారులు పాల్గొన్నారు. చెన్నై సెంట్రల్-విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్ నరసాపురం వరకు పొడిగిస్తూ రైల్వే బోర్డు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరే 'వందేభారత్' రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి స్టేషన్ల మీదుగా విజయవాడకు 11.40కి చేరుతోంది. ఇకపై ఈ రైలు గుడివాడ, భీమవరం మీదుగా నరసాపురం వరకు సర్వీసులందించనుంది.

### నో హెల్మెట్ నో పెట్రోల్

## ర్యాలీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి



**ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి**
**జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**
**జిల్లా ఎస్‌పి ఎల్.సుబ్బారాయుడు**

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** హెల్మెట్ ధరించిన కారణంగా రోడ్డు ప్రమాదాల నుండి వాహనదారులు తమ ప్రాణాలను రక్షించుకునే అవకాశం ఉంటుందని, ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పక హెల్మెట్ ధరించాలని మిగతా .. 2లో..

### పీపీపీ మోడల్ ద్వారా

## వైద్య రంగంలో విప్లవం

- ❑ గతంలో 20 ఏళ్లలో పూర్తయ్యే మెడికల్ కాలేజీల నిర్మాణాలు కేవలం 2 సంవత్సరాల్లో పూర్తవుతాయి
- ❑ మొత్తం మెడికల్ సీట్లు 500 నుంచి 1700-2000కి పెరుగుతాయి
- ❑ పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 850 సీట్లు కేటాయింపు
- ❑ యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలకు ఉచిత, కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుంది
- ❑ గత ఐదేళ్లలో ఖర్చు చేసిన రూ. 1550 కోట్లు కేంద్ర నిధులే : వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

2

## రిజల్ట్‌తో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రత ముఖ్యం



- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి
- విద్యార్థుల సంరక్షణపై నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి , విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు రాబట్టాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే విద్యార్థులను సమాయత్తం చేయాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఫలితాలతో పాటు మిగతా .. 2లో..

### తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలకు

## విస్తృత ఏర్పాట్లు

### తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు



**తిరుమల, విశ్వం వాయిస్ :** గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వైకుంఠ ద్వార దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు చేశామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు ఉంటాయని చెప్పారు. తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "మొదటి మూడు రోజులకు ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా టోకెన్లు కేటాయించాం. మిగతా ఏడు రోజులు సామాన్య భక్తులకు టోకెన్లు లేకపోయినా సర్వదర్శనం ద్వారా వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాం. భక్తుల రద్దీ ఉన్న ప్రదేశాల్లో ఏర్పాట్లు, సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. దాత మంతెన రామలింగరాజు సహకారంతో పీఏసీలను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతాం. ఇటీవల రూ.9కోట్లు విరాళంగా ఆయన అందించారు. ఆలయ ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో తితిదే స్వయంగా దివ్య వృక్షాలను పెంచాలని భావిస్తోంది. పలమనేరులో తితిదే గోశాల ఆవరణ వృక్షాల పెంపుదలకు అనువైన స్థలంగా మిగతా .. 2లో..

## 'నేను చచ్చిపోతున్నా.. నా కుటుంబానికి చెప్పు'

### సిడ్నీ 'హీరో' అహ్మద్



**విశ్వం వాయిస్ :** ఆస్ట్రేలియాలోని సిడ్నీలో యూదులపై ఉగ్రదాడి యావత్ ప్రపంచాన్ని ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ భయానక ఘటనలో ఉగ్రవాదులకు ఎదురొడ్డి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు 'రియల్ హీరో' హ్మద్ అల్ అహ్మద్. దాడి సమయంలో ఆయన అన్న మాటలు అందరి హృదయాల్ని కదిలిస్తున్నాయి. ఈ పోరాటంలో తాను చనిపోతానేమోనని, తన కుటుంబానికి చెప్పాలని అహ్మద్ పక్కనున్నవారితో అన్నారు.

**సిరియా నుంచి వచ్చి..**

అహ్మద్ అల్ అహ్మద్ స్వదేశం సిరియా. నిత్యం అంతర్యుద్ధంతో నలిగిపోయే ఆ దేశాన్ని వీడి భవిష్యత్తుపై కలలు కంటూ దశాబ్దం క్రితం ఆస్ట్రేలియాకు వలస వచ్చారు. కుటుంబంతో కలిసి దక్షిణ సిడ్నీలో సదర్లాండ్ షైర్‌లో కొత్త జీవితాన్ని ప్రారంభించారు. ఈయనకు ఇద్దరు చిన్న పిల్లలు. స్థానికంగా ఓ పండ్ల దుకాణం పెట్టి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఉగ్రదాడి జరిగిన ఆదివారం ఉదయం అహ్మద్ బోండి బీచ్‌లో తన బంధువు జోజీ అల్కాంజ్‌తో కలిసి కాఫీ షాప్‌లో ఉన్నారు. ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు వినిపించగానే వీరిద్దరూ భయపడిపోయారు. కాసేపటికి అహ్మద్ తేరుకున్నారు. ఉగ్రవాదులను చూడగానే మిగతా .. 2లో..

## నాడు గాంధీ, అంబేడ్కర్.. నేడు రాహుల్, ఖర్గే

- ఆర్ఎస్ఎస్ భావజాలంపై పోరాడుతున్న యోధులు
- వారికి అండగా ఉండకపోతే మోదీ కుట్రకు పేదలు ఆధార్, రేషన్ కార్డులు కోల్పోతారు : సీఎం రేవంత్‌రెడ్డి



**దిల్లీ, విశ్వం వాయిస్ :** రాజ్యాంగ రూపకల్పన సమయంలో పేదలకు ఓటుహక్కు కల్పించడాన్ని వ్యతిరేకించిన గోల్వాల్కర్‌కు వ్యతిరేకంగా నాడు మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలబడితే, ఇప్పుడు మోదీ, అమిత్‌షాలకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలు పోరాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం దిల్లీలోని రామ్‌లీలా మైదా నంలో కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో నిర్వహించిన 'ఓట్ చోర్... గద్దీ ఛోడ్' ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. "రాజ్యాంగం రూపొందించేటప్పుడు దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదలకు ఓటు హక్కు కల్పించేందుకు రాజ్యాంగ నిర్మాణ సభలో చాలా చర్చ జరిగింది. అప్పుడు ఆర్ఎస్ఎస్‌కు చెందిన గోల్వాల్కర్ ఈ వర్గాలకు ఓటు హక్కు కల్పించేందుకు విముఖత వ్యక్తంచేశారు. అయినప్పటికీ మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌లు వారికి ఓటు హక్కు ఇచ్చి ఈ దేశంలో ప్రభుత్వాల ఏర్పాటులో పేదలను భాగస్వాములను చేశారు. అయితే నరేంద్రమోదీ, అమిత్‌షాలు గోల్వాల్కర్ భావజాలాన్ని ఆచరణలో పెట్టడానికి గత లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని ప్రజల్ని అడిగారు. అయితే వారికి అలా ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లను రద్దు చేస్తారని రాహుల్‌గాంధీ అప్పుడే హెచ్చరించారు. దానివల్ల ఈ దేశ ప్రజలు భాజపాను 240 సీట్ల దగ్గరే నిలువరించారు. అందువల్లే రాజ్యాంగ రక్షణ సాధ్యమైంది.

**భూమి, ఇతర ఆస్తులూ లాగేసుకుంటారు**

తాము కోరుకున్న 400 సీట్లు రాలేదన్న పగతో భాజపా నాయకులు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో
# మంత్రి నారా లోకేష్ భేటీ

ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానం తీసుకొచ్చాం అని వివరించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే నైపుణ్య గణన కు కేంద్ర సహాయం కావాలని లోకేష్ కోరారు. దీనికి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులకు అద్భుతమైన వేదికగా ఏర్పాటుచేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు **MeitY** స్టార్టప్ హబ్ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో **AVGC-XR, WAVEX** ఫ్రేమ్‌వర్క్ కింద **InnoXR** యానిమేషన్, **AR/VR, Immersive Technologies** కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు సహకారం అందించండి. ఇండియా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) మిషన్ కింద రాష్ట్రంలో ఏఐ విస్తృతి వేగవంతానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎంపీలు ఉన్నారు.

# ఢిల్లీలో తీవ్ర పొగమంచు

వర్గాలు వెల్లడించాయి.

**పలు విమాన సర్వీసుల్లో అంతరాయం..**

మరోవైపు పొగమంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయం నుంచి వెళ్లే పలు విమాన సర్వీసుల్లో ఆలస్యం నెలకొన్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇండిగో, ఎయిరిండియా వంటి పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీలు జారీ చేశాయి. విమానాశ్రయంలో దృశ్యగోచరత తగ్గడం వల్ల పలు విమానాలు రద్దు కాగా.. మరికొన్ని ఆలస్యమయ్యాయని తెలిపాయి. విమానాల స్టేటస్ గురించి తెలుసుకోవడం కోసం తమ వెబ్‌సైట్లను పరిశీలిస్తూ ఉండాలని ప్రయాణికులకు సూచించాయి. ఆలస్యం వల్ల కలిగిన అసౌకర్యానికి ప్రయాణికులకు క్షమాపణలు తెలిపాయి. ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చడానికి చర్యలు తీసుకుంటున్నామన్నాయి.

## తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలకు
# విస్తృత ఏర్పాట్లు

గుర్తించాం. మంగళవారం తితిదే పాలకమండలి సమావేశం జరుగుతుంది. 50 అజెండా అంశాలపై చర్చిస్తాం. దివ్య వృక్షాల ప్రాజెక్టుపై పాలక మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తాం" అని బీఆర్ నాయుడు తెలిపారు.

# 'నేను చచ్చిపోతున్నా.. నా కుటుంబానికి చెప్పు'

వారిని ఎలాగైనా అడ్డుకోవాలనుకున్నారు. ఈ క్రమంలోనే తన ప్రాణాలు పోతాయని తెలిసినా ఆయన వెనకడుగు వేయలేదు. "నేను చనిపోబోతున్నా. నా కుటుంబాన్ని చూసుకో. ఒకవేళ నాకేదైనా జరిగితే ఇతరుల ప్రాణాలను కాపాడే క్రమంలో నేను నేలకొరిగానని నా కుటుంబానికి చెప్పు" అని అహ్మద్ తన బంధువుతో చెప్పారు. ఈ విషయాన్ని అల్కాంజ్ మీడియాకు వివరించారు. ఈ ఘటన సమయంలో కాల్పులు జరుపుతున్న దుండగుల్లో ఒకడిని అహ్మద్ అడ్డుకున్నాడు. వెనక నుంచి వచ్చి తుపాకీ లాక్కున్నాడు. దీంతో దుండగుడు అక్కడినుంచి పారిపోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఉగ్రవాదిని అడ్డుకునే సమయంలో అహ్మద్ గాయపడగా.. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ట్రంప్ ప్రశంసలు..

అహ్మద్ సాహసాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఆయన ఎంతో ధైర్యంగా ఉగ్రవాదులకు ఎదురునిలిచారని, ఆయన చేసిన పనికి చాలా గర్వపడుతున్నానని అన్నారు. అహ్మద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చేపల వేటకని వచ్చి ఉగ్ర దాడి..

సిడ్నీలోని బోండీ బీచ్‌లో ఉత్సవం సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో 16 మంది మరణించారు. కాల్పులు జరిపిన వారు తండ్రీకొడుకులని, వీరిని సాజిద్ అక్రమ్ (50), నవీద్ అక్రమ్ (24)గా పోలీసులు గుర్తించారు. వీరి కుటుంబం పాకిస్థాన్ నుంచి వచ్చి కొన్నేళ్లుగా ఆస్ట్రేలియాలో నివాసం ఉంటోంది. సాజిద్ స్థానికంగా పండ్ల దుకాణం నడుపుతుండగా.. నవీద్ రెండు నెలల కిందటే ఉద్యోగం కోల్పోయినట్లు తెలిపారు. చేపల వేటకు వెళు తున్నామని వీరిద్దరూ కుటుంబసభ్యులకు చెప్పినట్లు దర్యాప్తులో గుర్తించారు. దాడి సమయంలో సాజిద్ మృతి చెందగా.. నవీద్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

# నాడు గాంధీ, అంబేడ్కర్.. నేడు రాహుల్, ఖర్గే

ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో దళితులు, ఆదివాసీలు, పేదల ఓట్లను తొలగించే కుట్రకు తెరదీశారు. ఈ ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా అప్పట్లో మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎలా నిలబడ్డారో ఇప్పుడు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలు అలాగే నిలబడి మోదీ, అమిత్‌షాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ఇది కాంగ్రెస్ సమస్య కాదు.. దేశ సమస్య. అందువల్ల దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదల కోసం పోరాడుతున్న రాహుల్‌గాంధీకి అండగా నిలబడి ఆయన్ను బలోపేతంచేయాలి. ఈ పోరాటంలో రాహుల్‌గాంధీని గెలిపించాలి. లేదంటే పేదల ఓటు హక్కు లాగేసుకుంటారు. ఒక్కసారి ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగిస్తే ఆ తర్వాత వరుసగా ఆధార్‌కార్డు, రేషన్ కార్డు రద్దు చేసి తర్వాత భూమి, ఇతర ఆస్తులు లాగేసుకుంటారు. ఈ దేశ మూలవాసులైన ఆదివాసీలు మొత్తం కోల్పోతారు. అందువల్ల మనమంతా రాహుల్‌గాంధీ సిపాయిలుగా మారి మోదీకి వ్యతిరేకంగా యుద్ధం చేయాలి" అని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ కూడా పాల్గొన్నారు.

## నో హెల్మెట్ నో పెట్రోల్
# ర్యాలీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎస్పి

జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం తిరుపతి పట్టణంలోని జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ నుండి సుమారు 700 మందితో ఏర్పాటు చేసిన నో హెల్మెట్ నో పెట్రోల్ ర్యాలీని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడితో కలసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల కారణంగా సుమారు 500 మంది ద్విచక్ర వాహనదారులు మరణిస్తున్నారని, వీరిలో చాలా వరకు హెల్మెట్ లేకపోవడంతో తలకు బలమైన గాయాలై మరణించారన్నారు. హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే వీరు ప్రాణాలతో ఉండే అవకాశం ఉండేదన్నారు. జిల్లా పోలీస్ శాఖ ద్వారా నో హెల్మెట్ - నో పెట్రోల్ ర్యాలీ నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా నేటి నుండి జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్ లో హెల్మెట్ లేనిదే ద్విచక్ర వాహనాలకు ఇవ్వడం ఉండదని తెలిపారు. రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వాహనాలు నడిపే సమయంలో ద్విచక్ర వాహనదారులు భాధ్యతగా హెల్మెట్ ధరించాలని, వారు భాధ్యత విస్మరించినట్లైతే వారి ప్రాణాలు కాపాడుకోవడంలో భాగంగా ప్రభుత్వం నిర్బంద చర్యలు చేపట్టవలసి ఉంటుందన్నారు. తిరుపతి పట్టణం అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నదని, ఇటువంటి పట్టణాలలో చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు రూపొందించుటకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ హెల్మెట్ లేని కారణంగా రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు ఎక్కువ శాతం మరణిస్తున్నారని, హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకుని తమ కుటుంబాలతో సురక్షితంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించడం తమ ధ్యేయం కాదని, ప్రజల భద్రత తమ భాధ్యత అని అన్నారు. హెల్మెట్ ధరించడం పై అవగాహన కల్పించడంలో భాగంగా నో హెల్మెట్ నో పెట్రోల్ ర్యాలీ నిర్వహించడం జరుగిందన్నారు. ద్విచక్ర వాహనాదారులు చిన్న ఆక్సిడెంట్ ల కూడా తలకు బలమైన గాయాల కారణంగా మరణిస్తున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పక హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో ఏఎస్పిలు రవి మనోహరాచారి, డి.శ్రీనివాసరావు, నాగభూషణం, డీఎస్పీలు, సిఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రిజల్ట్‌తో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రత ముఖ్యం

విద్యార్థుల ఆరోగ్యం, సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏబీసీడబ్ల్యూఈవోలు, డీబీసీడబ్ల్యూఈవోలు, ఎంజేపీ కన్వీనర్లు, ప్రిన్సిపాళ్లతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ కార్యదర్శి మాధవీలతతో కలిసి మంత్రి సవిత జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో జిల్లాల వారీగా ఆయా హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాల్లో తీసుకుంటున్న చర్యలు గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. గత విద్య సంవత్సరంలో వచ్చిన ఉత్తీర్ణతా శాతాన్ని తెలుసుకుంటూ, వచ్చే పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణ సాధించాలని దిశా నిర్దేశం చేశారు. రిజల్ట్ తో పాటు విద్యార్థులంతా ఏ గ్రేడ్ లో ఉత్తీర్ణలయ్యేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏ సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడిన ఉన్నారో తెలుసుకుని, ఆయా సబ్జెక్టుల్లో వారు పట్టు సాధించేలా బోధన సాగించాలన్నారు.

**విద్యార్థుల ఆరోగ్యం, భద్రత ఎంతో ముఖ్యం**

ప్రస్తుతం రోజు రోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు తాజా, వేడి ఆహారం మాత్రమే అందించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విశ్రాంత, తరగతి గదుల్లో దోమలు చొరబడకుండా ద్వారాలు, కిటికీల దగ్గర దోమ తెరలు వాడాలన్నారు. నిర్దేశించిన గడువు ప్రకారం విద్యార్థులందరికీ హెల్త్ చెకప్ లు చేయించాలన్నారు. హాస్టళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వార్డెన్లు హాస్టల్లో భోజనాన్ని ముందుగా రుచి చూడాలని, తరవాత విద్యార్థులందరితో కలిసి భోజనం చేయాలని మంత్రి స్పష్టంచేశారు. బయట ఆహారం హాస్టళ్లలోనికి రానివ్వొద్దని, అదే సమయంలో విద్యార్థులను బయటకు పంపకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు, సంరక్షకులు వచ్చినప్పుడే వారితో బయటకు పంపాలన్నారు. విద్యా భోధనతో పాటు హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం, సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల సంరక్షణపై నిర్లక్ష్యంపై వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత హెచ్చరించారు.

**హాస్టళ్లను తరుచూ సందర్శించండి...**

ఏబీసీడబ్ల్యూఈవోలు, డీబీసీడబ్ల్యూఈవోలు, ఎంజేపీ కన్వీనర్లు తరుచూ తమ పరిధిలో ఉన్న హాస్టళ్లను, గురుకులాలను సందర్శించాలని మంత్రి సవిత ఆదేశించారు. హాస్టళ్లను ఉన్నతాధికారులు తరచూ సందర్శించడం వల్ల వార్డెన్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తారన్నారు. వార్డెన్లు రాత్రిళ్లు హాస్టళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రిళ్లు హాస్టళ్లలో లేని వార్డెన్లను ఉపేక్షించేది లేదని, విద్యార్థుల భద్రత ఎంతో ముఖ్యమని స్పష్టంచేశారు. డీబీసీడబ్ల్యూఈవోలు తమ జిల్లాల కలెక్టర్లను కలిసి, సీఎస్సార్ ఫండ్స్ సేకరణకు కృషి చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో బీసీ సంక్షేమ శాఖాధికారులు, అన్ని జిల్లాల ఏబీసీడబ్ల్యూఈవోలు, డీబీసీడబ్ల్యూఈవోలు, ఎంజేపీ కన్వీనర్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

**పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు...**

అంతకుముందు అమరజీవి పొట్టి శ్రీరాముల వర్థంతి సందర్భంగా సచివాలయంలోని తన ఛాంబర్ లో మంత్రి సవిత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దీక్ష చేపట్టి ఆత్మార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన వదిలిన ఊపిరే తెలుగు వారి శ్వాస అని అన్నారు. అమరజీవి పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఎంతో ఆదర్శమని, ఆయన లక్ష్య సాధనకు అందరమూ కృషి చేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

## పీపీపీ మోడల్ ద్వారా
# వైద్య రంగంలో విప్లవం

- గతంలో 20 ఏళ్లలో పూర్తయ్యే మెడికల్ కాలేజీల నిర్మాణాలు కేవలం 2 సంవత్సరాల్లో పూర్తవుతాయి
- మొత్తం మెడికల్ సీట్లు 500 నుంచి 1700-2000కి పెరుగుతాయి
- పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 850 సీట్లు కేటాయింపు
- యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలకు ఉచిత, కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుంది
- గత ఐదేళ్లలో ఖర్చు చేసిన రూ. 1550 కోట్లు కేంద్ర నిధులే : వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) మోడల్ ద్వారా వైద్య విద్యలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న ఈ విధానం పేద ప్రజలకు, మధ్యతరగతి విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా రూపుదిద్దబడిందని ఆయన అన్నారు. వైఎస్సార్‌సీపీ ధర్నా పేరుతో మాయాజాలం చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఈ పార్టీ గత ఐదు ఏళ్లలో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనుకకి తానీడిచి, ప్రజలను నిర్లక్ష్యానికి వదిలేసిందని, కేవలం 11 సీట్లు మాత్రమే ప్రజలు ఇచ్చారని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి పులివెందుల ఎమ్మెల్యేగా మిగిలిపోయి, అసెంబ్లీకి రాకుండా చరిత్రలో నిలిచిపోతున్నారని, ఇలాంటి పార్టీకి ప్రజా ఉద్యమాలు చేసే అర్హత లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న పీపీపీ మోడల్ ద్వారా మెడికల్ కాలేజీల నిర్మాణం కేవలం 2 సంవత్సరాల్లో పూర్తవుతుందని, గతంలో అదే పనికి 20 ఏళ్లు పడుతుందని వివరించారు. పీపీపీ విధానం ద్వారా మొత్తం మెడికల్ సీట్లు 500 నుంచి 1700%-%2000కి పెరుగుతాయని, ప్రత్యేకంగా పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం 850 సీట్లు కేటాయింపుగా ఉంటాయని చెప్పారు. అదనంగా 220 సీట్లు ప్రభుత్వ కోటాలో 110 సీట్లు పెరుగుతాయని, పీపీపీ ఆసుపత్రుల్లో అంతర్జాతీయ స్థాయి వసతులు, హై-క్వాలిటీ సిబ్బంది, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు అందుబాటులో ఉంటారని, యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**వైఎస్సార్‌సీపీ పాలనలో వైఫల్యాలు**

గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ పాలనలో మెడికల్ రంగంలో చేసిన విఫలతలను కూడా మంత్రి అచ్చెన్నాయుడు ఎత్తిచూపారు. ఈ సమయంలో ఖర్చు చేసిన రూ. 1550 కోట్లు కేవలం కేంద్ర నిధులే, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, 18 శాతమే కాలేజీలు నిర్మాణంలో పూర్తయిందని తెలిపారు. జగన్ ప్రారంభించిన ఐదు కాలేజీలను నేషనల్ కౌన్సిల్ పాఠశాల స్థాయిలో నిర్మాణం అని గుర్తించి సీట్లు తగ్గించిందని, కోవిడ్ సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు రాష్ట్రంలో లేరని, పేదవారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస మౌలిక వసతులు కూడా పొందలేకపోయారని, ప్రజలకు కఠిన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు.

**ప్రజలకు భవిష్యత్ లాభాలు**

మహిళలు, పిల్లలు, పేదవారికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో, కూటమి ప్రభుత్వం పీపీపీ మోడల్ ద్వారా 2 సంవత్సరాల్లో మెడికల్ కాలేజీలు పూర్తిచేయగలుగుతుందని, మొత్తం సీట్లు 1700%-%2000కి పెరుగుతాయని, పేదవారికి ప్రత్యేకంగా 850 సీట్లు కేటాయించబడుతాయని, ఆసుపత్రుల్లో 1500 బెడ్స్ వరకు విస్తరణ జరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ చేసే 'నాటకాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. పీపీపీ మోడల్ ద్వారా పేదలకు, మధ్యతరగతికి, ప్రజలకు అందుబాటులో ఉన్న వనరులను తెలియజేయాలని కోరారు.

**కోటి సంతకాల సేకరణ ఓ మాయాజాలం**

వైఎస్సార్‌సీపీ "కోటి సంతకాల సేకరణ" పేరుతో ప్రజలను మాయాజాలంలో మోసాదుతున్న విధానాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. ఇలాంటి నాటకాలు పేద, మధ్యతరగతి ప్రజలను వంచించడమే కాక, వారి కష్టాలను రాజకీయ ప్రయోజనాలకు తిప్పే ప్రయత్నం మాత్రమే అని మంత్రి అన్నారు. కేవలం సంతకాల సేకరణతోనే గందరగోళం సృష్టించడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. కేవలం రాజకీయ మాయాజాలం, ప్రజల కోసం నేరుగా ఉపయోగపడని వ్యర్థ ప్రయత్నమని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం నిజమైన పనితో, ప్రజల శ్రేయస్సుకు, పేదవారి అభివృద్ధికి ముందడుగు వేస్తోంది, వైసీపీ చేస్తున్న వ్యర్థ నాటకాలను ప్రజలు గమనించి, తిరస్కరించాలని పిలుపునిచ్చారు.

# కూటమి అలెర్ట్.. సీట్లు పెరగవు..!



వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో 50 వరకు అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని తద్వారా తమకు ఇబ్బందులు ఉండవని ఆశలు పెట్టుకున్న నాయకులకు భారీ షాక్ తగిలింది. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో కులగణన అనంతరం జన గణన ప్రారంభం కానున్నాయి. ఈ రెండు కూడా రెండు సంవత్సరాల పాటు జరగనున్నాయి. దీంతో నియోజక వర్గాల పునర్విభజన అంశం తెరమీదకు వచ్చే అవకాశం లేదు. మరోవైపు పార్టీల పరంగా చూస్తే నాయకుల సంఖ్య ఎక్కువగా ఉంది. ముఖ్యంగా కూటమిలో అయితే మరింత ఎక్కువగా కనిపిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి జనసేన తరపున కనీసం 40 స్థానాలు తీసుకోవాలన్న ఆలోచన కూడా ఆ పార్టీ నాయకులు మధ్య అంతర్గత చర్చలో వినిపిస్తోంది. టిడిపిలో కూడా చాలామంది నాయకులు గత ఎన్నికల్లో త్యాగాలు చేశారు. ఇప్పుడు మరో 20 స్థానాల్లో జనసేనకు ఇస్తే ఆ 20 మంది తగ్గే అవకాశం ఉంది. ఇక బిజెపి విషయానికొస్తే గత ఎన్నికల్లో పది స్థానాలను తీసుకున్నారు. ఇప్పుడు కనీసం 20 స్థానాలు పట్టు పట్టే అవకాశం కనిపిస్తుంది. మొత్తంగా చూస్తే సీట్ల సంఖ్య పెరగడం లేదు. మరోవైపు నాయకులు పార్టీల నుంచి డిమాండ్లు అయితే పెరుగుతున్నాయి. ఆవారా టిడిపికి ఇబ్బందికర పరిస్తితులు ఎదురుకానున్నాయి. ఇక మరోవైపు వైసీపీ ఒంటరి ప్రయాణానికి సిద్ధమైంది. అయినప్పటికీ ఆ పార్టీలో కూడా నాయకుల సంఖ్య ఎక్కువగా ఉంది. దీనికి తోడు అప్పటికప్పుడు పుట్టుకొచ్చే నాయకులు, సామాజిక వర్గాలు, కుల సమీకరణల ఆధారంగా తీసుకునే నిర్ణయాలను బట్టి నాయకుల సంఖ్య మరింత పెరుగుతుంది. అయినప్పటికీ వైసీపీలో పెద్దగా ఇబ్బంది లేకపోయినప్పటికీ కూటమిలో మాత్రం సీట్ల సంఖ్య పెరగకపోవ డంతో ఈ ప్రభావం కూటమి పార్టీలపై ప్రబలంగా పడే అవకాశం ఉంటుంది. అయితే, ఇప్పటిప్పుడు దీనికి సంబంధించి చర్చ నడవక పోయినప్పటికీ పార్టీ నేతల్లో మాత్రం ఆశలు పెరుగుతున్నాయి. జనసేన 40 స్థానాలు దక్కించుకోవాలన్న వాదనైతే బలంగా ఉంది. బిజెపిలోను ఇదే చర్చ నడుస్తుంది. గత ఎన్నికల కన్నా ఎక్కువగా సీట్లు కావాలన్న విషయంపై నాయకులు ఇప్పటినుంచే దృష్టి పెట్టారు. వాస్తవానికి సీట్ల సంఖ్య పెరుగుతుందని ముందు నుంచి అనుకున్నారు. దీంతో ఒకవేళ జనసేన, బిజెపి లకు ఎక్కువ సీట్లు ఇచ్చినప్పటికీ ఇబ్బంది లేదని భావించారు. అసలు ఇప్పుడు టిడిపిలో నేతలు ఉన్న సంఖ్యకు సీట్ల సంఖ్యకు సంబంధం లేకపోవడం మెజారిటీ నాయకులకు కూడా గత ఎన్నికలలో టికెట్లు లభించక ఇబ్బందులు పడిన పరిస్థితిని గమనిస్తే వచ్చే ఎన్నికల నాటికి అసలు సీట్లు పెరగకపోవడంతో పాటు నాయకుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో ఇబ్బందులు తప్పకపోవచ్చు అన్న వాదన ఉంది. ఈ నేపథ్యంలో పార్టీలు ముఖ్యంగా టిడిపి అలర్ట్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ నాయకులకు కేవలం ఎమ్మెల్యే సీట్లు ఎంపీ సీట్లు పదవులు కావని.. నామినేటెడ్ పదవుల ద్వారా కొంతమందిని సర్దుబాటు చేసే అవకాశం ఉందని నాయకులు చెబుతున్నారు. మొత్తానికి నియోజకవర్గాల పునర్విభజన లేకపోవడం కూటమికి ఇబ్బందికరంగానే మారింది అన్నది వాస్తవం.

# ఛాన్స్ కోసం 'చెల్లెళ్ల' వెయిటింగ్.. !

వైసీపీని గత ఎన్నికల్లో దెబ్బతీసిన అనేక కారణాల్లో జగన్ సోదరీమణులు కీలక పాత్ర పోషించారు. తోడ బుట్టిన షర్మిలతోపాటు.. బాబాయి కుమార్తె సునీతలు ఇద్దరూ.. గత ఎన్నికల సమయంలో ఊరూ వాడా తిరిగి జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. దీనికి తోడు.. కూటమి పార్టీలు కూడా.. ప్రచార పర్వంలో ముందుకు సాగాయి. ఫలితంగా సొంతగా చేసుకున్న పనులతోపాటు.. ఈ వ్యతిరేక ప్రచారం దోహదపడి వైసీపీ పతనానికి దారి తీసింది. మరీముఖ్యంగా ఇద్దరు చెల్లెళ్ల ప్రచారం పార్టీకి శరాఘాతంగా పనిచేసింది. అయితే.. అక్కడితో అయిపోయిందా? షర్మిల, సునీతలు ఇద్దరూ శాంతించారా? అంటే.. లేదనే చెబుతున్నారు పరిశీలకులు. వారిద్దరూ మళ్లీ ఛాన్స్ కోసం ఎదురు చూస్తున్నారన్నది పరిశీలకులు, విశ్లేషకులు చెబుతున్న మాట. అయితే.. ఆ ఛాన్స్ ఎన్నికలేనా? అంటే.. అవకాశం ఎప్పుడు వస్తే అప్పుడు విరుచుకు పడేందుకు ప్లాన్‌రెడీ చేసుకుంటున్నారని అంటున్నారు. ఇద్దరు సోదరీమణులు ఎదురు తిరగడానికి కారణమైన కీలక సమస్యలు అలానే ఉన్నాయి. అవి పరిష్కారం కానంత వరకు .. జగన్‌కు పక్కలో బల్లెం మాదిరిగా ఇద్దరు చెల్లెళ్లు.. కాచుకుని కూర్చుంటారని చెబుతున్నారు. ఆస్తుల వివాదం, రాజకీయ ఉన్నతి కోసం షర్మిల పాకులాడుతున్నారు.



దీనిలో రాజకీయంగా ఆమె ఒక లైన్ తీసుకున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నారు. కానీ, ఇక్కడ కూడా.. జగన్ చక్రం తిప్పుతున్నారని.. కాంగ్రెస్ పార్టీలోని కొందరిని ఆయన మేనేజ్ చేస్తున్నారని.. ఫలితంగా తన గ్రాఫ్ పెరగడం లేదని షర్మిల భావిస్తున్నారు. ఇక, ఆస్తుల వివాదం ఎటూ తేలడం లేదు. సునీత విషయానికి వస్తే.. ఏకైక అజెండా వివేకానందరెడ్డి దారుణ హత్య. ఈ కేసు ఎటూ తేలడం లేదు. మరో మూడేళ్లు పట్టినా అంటే.. వచ్చే ఎన్నికల నాటికి కూడా తేలుతుందా? అనేది ప్రశ్న. సో.. ఈ సమస్య తేలే వరకు.. సునీత డైరీలో ఉన్న వారికి శిక్షలు పడే వరకు ఆమె శాంతించేది లేదు. సో.. ఈ ఇద్దరు చెల్లెళ్లు కూడా.. అన్నపైన, అన్నరాజకీయాలపైనా.. ఓ కన్నేసి ఉంచారన్నది వాస్తవం. సో.. వీరి బెడద జగన్ కు తొలిగిపోలేదు. ఎప్పుడైనా .. ఎక్కడైనా వీరు విజృంభించే అవకాశం మెండుగానే కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 16 డిసెంబర్ 2025




www.viswamvoice.com

# తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకుందాం..

## విగ్రహావిష్కరణ మహోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల హాజరు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకుందామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలన్న అంశానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సోమవారం కడియంలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన వెలుగుబంటి రామచంద్రారావు ఛారిటబుల్ ట్రస్ట్, శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు స్ఫూర్తిదాతల విగ్రహావిష్కరణ మహోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాతఃస్మరణీయులైన చేళ్లపిళ్ల వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రి, దువ్వూరు సుబ్బమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దువ్వూరి సుబ్బమ్మ మనవరాలు దువ్వూరి రాజ్యలక్ష్మికి, నిర్వాహకులకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుత క్రీడా మైదానంతో విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసం కోసం షిర్డీసాయి విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. గురుజాడ వేంకట అప్పారావు, చల్లపల్లి వేంకటశాస్త్రి గృహాలను, స్థలాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు.ఈ సందర్భంగా వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రిల నాటకం కురుక్షేత్రాన్ని గుర్తుచేసుకున్నారు. తిరుపతి వెంకట కవులు రాసిన చెల్లియో చెల్లకో తమకు చేసిన యెగ్గలు సైచిరందరున్ తొల్లి, మామ ఎప్పుడు వచ్చితివి,జెండాపై కపిరాజు, అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడు అజాతశత్రుడే అలిగిననాడు తదితర పద్యాలను స్మరించుకున్నారు. గత ప్రభుత్వం తెలుగును విస్మరించిందని విమర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్యలో మాతృభాష విద్యా బోధనను తల్లిపాలు తాగి పెరిగిన పిల్లలతో, ఆంగ్లబోధనను పోత పాలతో తాగి పెరిగిన పిల్లలతో పోల్చిచెప్పారు. త్రిభాష సూత్రం అవసరాన్ని వివరించారు. అన్ని భాషలకు ప్రాధాన్యతనిస్తూనే తెలుగు అగ్రతాంబూలం ఇవ్వాలన్నారు.తెలుగుకు మరింత గుర్తింపు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. చేళ్లపిళ్ల వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రి, దువ్వూరు సుబ్బమ్మ విగ్రహాలను పుష్కరాల సమయంలో గోదావరి గట్టు మీద ఏర్పాటు చేయాలని తెలుగు సాహితీ కార్యక్రమాలు, నిర్వహణ కమిటీ చైర్మన్, కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ చేసిన వినతి సముచితం అన్నారు. అందుకు కృషి చేస్తామన్నారు. గతంలో జరిగిన నంది నాటకోత్సవాలను ఉదహరిస్తూ సరైన విధానంలో పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తే నేటికీ కూడా ఆదరణ ఉంటుందన్నారు. నేటికీ లండన్ లో థియేటర్ ఆర్ట్స్ కి నేటికి ఆదరణ ఉందన్నారు. గతంలో హామ్లెట్ అనే నాటకాన్ని ప్రదర్శించినప్పుడు సినిమా థియేటర్ కంటే ఎక్కువగా జనం వచ్చిన ఘటనను ఉదహరించారు. ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా లాంటి విభాగాన్ని రాజమండ్రిలో ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను అభ్యర్థించానని, సూత్రప్రాయంగా అంగీకరించారని అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో స్థలం సూచిస్తే అందులో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విభాగం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. తెలుగుభాషను పెంచి పోషించినప్పుడే తిరుపతి వేంకట కవులకు ఘన నివాళులర్పించిన వాళ్లమవుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శ్రీమతి దువ్వూరి రాజ్యలక్ష్మి, తెలుగు సాహితీ కార్యక్రమాలు, నిర్వహణ కమిటీ చైర్మన్, కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ , హాస్యబ్రహ్మ శంకరనారాయణ, అవధానులు ధూళిపాల మహదేవ మణి, తాతా సందీప్ శర్మ, ఆకెళ్ళ బాలబాను తదితరులు పాల్గొన్నారు.

### చేనేత సహకార సంఘాలకు బాకీ ఉన్న డబ్బులు

# వెంటనే విడుదల చేయాలి

## ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చేనేత సహకార సంఘాల చేనేతల సమావేశం సోమవారం సాయంత్రం రాజ మండ్రి స్థానిక ఉమారామలింగేశ్వర స్వామి కళ్యాణ మండపం నందు జరిగింది సుమారు 40 సంఘాల ప్రతినిధులు హాజర య్యారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గసభ్యులు పప్పు దుర్గా రమేష్, మాజీ ఆప్కో డైరెక్టర్ ముప్పన వీర్రాజు, చేనేత కార్మిక సంఘం నాయకులు నల్లా రామారావు,అల్లక రాజు, దొంతంశెట్టి సత్యప్రకాష్ తదితరులు డిమాండ్ చేస్తూ... తక్షణమే 6సంవత్సరాల నుంచి చేనేత సహకార సంఘాలకు బాకీ ఉన్న డబ్బులు వెంటనే విడుదల చేయాలని, సహకార సంఘాల నుంచి వస్త్రాలు కొనుగోలు చేయాలని చేనేతల సమస్యలను పట్టించు కోకుండా ప్రభుత్వానికి చేనేతలకు అడ్డంకిగా వ్యవహరిస్తూ,చేనేత సహకార సంఘాల నుంచి వస్త్రాలు ఆర్డర్ కు ఇచ్చి కూడా రద్దు చేస్తూ అన్యాయం చేస్తున్న ఆప్కో ఎండి మరియు హాండ్లూమ్ కమీషనర్ రేఖారాణిని ప్రభుత్వం ఈ బాధ్యతల నుంచి బదిలీ చేయాలని, అలాగే త్రిఫ్ట్ ఫండ్ పథకం, యార్న్ సబ్సిడీ,30శాతం రిబేట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి లోపు ఆప్కో బకాయిలు విడుదల చెయ్యకపోతే చేనేత సహకార సంఘాలు,చేనేత కుల సంఘాలు,చేనేత ఉద్యమ సంఘాలను కలుపుకుని రిలే నిరాహారదీక్షలతో మొదలు పెట్టి ఆమరణ నిరాహారదీక్షకు ఉద్యమ కార్యాచరణ చేస్తామని డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణను సంఘాలతో కలపి చర్చించారు. ఈ కార్యక్రమంలో సమతం రమణ మహేష్,బేతా సత్యన్నారాయణ,చింతా వీరభద్రేశ్వరరావు, కెవివి సత్యన్నారాయణ తదితరులు హాజరయ్యారు.

# రెవెన్యూకు షాక్..!

## సచివాలయాలకు సర్కార్ కీలక ఆదేశం..

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థలో ప్రస్తుత కూటమి సర్కార్ కీలక మార్పులు చేస్తోంది. సచివాలయాల ప్రక్షాళన, సిబ్బంది మార్పులతో పాటు వారి విధుల్లోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా సచివాలయాల సిబ్బంది ప్రతీ సమస్యకూ రెవెన్యూ శాఖ అధికారుల్ని ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా కీలక సర్కులర్ జారీ చేసింది. రాష్ట్రంలో గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలలో రెవెన్యూ శాఖ సేవల కోసం వచ్చే దరఖాస్తులను డిజిటల్ అసిస్టెంట్లు /వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ఎవరి అనుమతి లేకుండానే నేరుగా స్వీకరించి, ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం సర్కులర్ జారీ చేసింది. కొన్ని గ్రామ,వార్డు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు రెవెన్యూ సేవలకు సంబంధించిన దరఖాస్తులను ముందుగా గ్రామ రెవెన్యూ అధికారి (వి ఆర్ ఓ)/వార్డు రెవెన్యూ కార్యదర్శి (డబ్ల్యూ ఆర్ ఎస్)/సర్వేయర్ పరిశీలించకుండా స్వీకరించడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపింది. ఇది గ్రామ /వార్డు సచివాలయాల ప్రాథమిక లక్ష్యమైన, పౌరులకు వారి ఇంటి వద్దే త్వరితగతిన, పౌరహితస్ఫూర్తితో సేవలను అందించాలన్న ఉద్దేశ్యానికి విరుద్ధమని సర్క్యులర్‌లో పేర్కొంది. కాబట్టి ఈసారి నుంచి రెవెన్యూ శాఖ సేవల కోసం వచ్చే దరఖాస్తులను డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు నేరుగా స్వీకరించి ప్రాసెస్ చేసేందుకు అనుమతి మంజూరు చేసింది. కాబట్టి ఏ పౌరుడు సంబంధిత సేవల కోసం సచివాలయానికి వచ్చినా, వీఆర్వో/డబ్ల్యూ ఆర్/సర్వేయర్ లేదా ఇతర అధికారుల సూచనలు కోసం వేచి లేకుండా, అన్ని డిజిటల్ అసిస్టెంట్లు / డబ్ల్యూ ఈ టి పి ఎస్ లు ఆ దరఖాస్తులను తప్పనిసరిగా స్వీకరించి, ప్రాసెస్ చేయాలనే ఆదేశాలు ఇచ్చారు. దరఖాస్తులను తిరస్కరించడం, ఆలస్యం చేయడం లేదా షరతులతో స్వీకరించడం పూర్తిగా నిషేధించినట్లు సర్కులర్ లో పేర్కొన్నారు. ఈ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకుంటారు. జిల్లా కలెక్టర్లు ఈ ఆదేశాల అమలు కోసం సంబంధిత ఫీల్డ్ స్థాయి సిబ్బందికి వెంటనే తగిన సూచనలు జారీ చేయాలని, అలాగే జిల్లా జివిస్డబ్ల్యూఎస్ అధికారులు, డి డి ఓలు, ఎన్జీవో/యూజీవోలు తమ పరిధిలోని గ్రామ , వార్డు సచివాలయాల్లో ఈ సూచనలు చేశారు.

### పెండింగ్‌లో ఉన్న బీసీ సమస్యలు

# వెంటనే పరిష్కరించాలి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పెండింగ్‌లో ఉన్న బీసీ సమస్యల వెంటనే పరిష్కరించాలని బిసి జాతీయ ఉద్యమ నాయకులు ఆర్.కృష్ణయ్యని కలిసి వినతిపత్రం అందజేసినట్లు అమలాపురానికి చెందిన బిసి నాయకురాలు దేవు అనిత తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓబీసీ సెమినార్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. కేంద్ర మంత్రివర్గంలో బీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. విద్య ఉపాధి రిజర్వేషన్ల అమలులో అన్యాయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని డిమాండ్ చేశారు.

### పలు సమస్యలకు పరిష్కారం కోరుతూ

# 'మీకోసం'కు అర్జీలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం( ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమానికి పలు గ్రామాల నుండి అర్జీలు అందినట్లు రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఒంటరి మహిళా పింఛన్ ఇప్పించాలని ద్రాక్షారామం గ్రామం నుండి వినతి అందగా, కాపవరం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని, అంగర గ్రామం నుండి పంట పొలాలకు నీటిని అందించడానికి పంటబోదు ఏర్పాటు చేయాలని, భూమి సర్వే చేయించాలని, సత్యవాడ గ్రామం నుండి రైతు భరోసా ఇప్పించాలని, వెలంపాలెం గ్రామం నుండి భూమి రీ సర్వే కు సంబంధించి షేప్ ఫైల్ ఇప్పించాలని, పొలం సబ్ డివిజన్ చేయమని కోరుతూ రామచంద్రపురం నుండి, అక్వాకల్చర్ భూమిని వ్యవసాయ భూమిగా మార్చమని నరసాపురపుపేట నుండి, రేషన్ షాప్ ఇప్పించాలని కోరుతూ పసలపూడి గ్రామం నుండి. పరిష్కారం కోరుతూ పలువురు అర్జీలను సమర్పించినట్లు ఆర్డీవో అఖిల తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్డీవో వివరించారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

### వినియోగదారులు సహకరించగలరు..



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏటపాక మండలంలోని బుట్టాయిగూడెం సబ్ స్టేషన్‌లో ది.17.12.2025 మరియు 18.12.2025 నాడు 33/11 కె.వి బుట్టాయిగూడెం సబ్‌స్టేషన్ నందు గల ఒక పవర్ ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తు చేయుట నిమిత్తం 11 కె. వి తోటపల్లి ఫీడర్‌కు సంబందించిన అగ్రికల్చర్ రైతులకు 3 ఫేజ్ సప్లై ఉదయం గం.5.00 నుంచి ఉదయం 9.00 వరకు మరియు సాయంత్రం 4.00 నుంచి 6.00 వరకు అలాగే 11 కె.వి వెంకటరెడ్డి పేట మరియు 11 కె. వి లక్ష్మిపురం ఫీడర్‌కు సంబందించిన రైతులకు ఉదయం 9.00 నుంచి 4.00 వరకు 3 ఫేజ్ సప్లై ఇవ్వబడును. కావున విద్యుత్ అంతరాయమునకు ఈరెండు రోజులు రైతులు సహకరించవలసిందిగా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు.

### అఖిలభారత సీఐటియూ

# మహా సభలను జయప్రదం చేయండి

### జిల్లా అధ్యక్షులు తోట శ్రీనివాస్



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 31 నుండి జనవరి 4వరకు వైజాగ్‌లో జరిగే అఖిల భారత సీఐటియూ మహా సభలను జయప్రదం చేయాలనీ సీఐటియూ జిల్లా అధ్యక్షులు తోట శ్రీనివాస్ ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర సీఐటియూ ఆదేశాల మేరకు డిసెంబర్ 15 జరిగే ఓడ, ఓడల జెండా ఆవిష్కరణ కార్యక్రమం గుండాలలో సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం గుండాల సీ ఐ టి యూ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా జెండాను జిల్లా అధ్యక్షులు తోట. శ్రీనివాస్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు తోట. శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని, పని గంటల సమయాన్ని తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐద్వా అధ్యక్షులురాలు ఐ.పద్మావతి, అంగన్వాడీ టీచర్స్ తోట పుష్ప,తోట సుభద్ర, ఆశ వర్కర్స్ కమలమ్మ, సరళ కుమారి, గ్రామపంచాయతీ వర్కర్స్ సత్యనారాయణ, తోట పాపారావు, నడిపింటి రవి, పెయింటింగ్ వర్కర్స్ రాజా మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ




**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో 9,10వ తరగతి విద్యార్థినులకు సిపిఆర్‌పై శిక్షణ ఇచ్చారు. వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. తద్వారా గ్రామం, రాష్ట్రం, దేశం మొత్తం కూడా ఆరోగ్యంగా ఉంటుందనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా పనిచేయుచున్న టువంటి సంస్థ ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రథమ చికిత్స,హెల్తీ లైఫ్ స్టైల్(ఆరోగ్య జీవన విధానం) కార్డియాక్ అరెస్టు జరిగినప్పుడు చేయవలసిన అత్యవసర చికిత్స సిపిర్ లపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు వివిధ గ్రామాల నుండి వచ్చిన 30 మంది అభ్యర్థులకు ప్రథమ చికిత్స,గృహ వైద్యం,హెల్దీ లైఫ్ స్టైల్, సిపిర్ లపై శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యభారతి,ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ పి.శ్రీనివాసరావు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ (రాజమండ్రి) డాక్టర్ ఏవియల్ నారాయణ, కార్యదర్శి, ఆరోగ్యభారతి(ఆంధ్ర ప్రదేశ్) దీనదయాల్ హాస్పిటల్ (నాగాయలంక), చింతూరు సేవాభారతి వైద్యులు గంగాధర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి : ఐద్వా సంఘం



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 21వ తేదీన జరిగే సిపిఎం పార్టీ అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఐద్వా మండల కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి సీనియర్ నాయకురాలు ముర్రం రంగమ్మ మాట్లాడుతూ ప్రజల కోసం బడుగు బలహీన వర్గాల బాగుకోసం శ్రమించి అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ సభ కు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె కోరినారు. ఇందులో భాగంగా కామ్రేడ్ పాయం సీతమ్మ 16వ వర్ధంతి సభ నిర్వహించారు. సీతమ్మ చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ సభ్యులు కట్టం రాములమ్మ, శారద, కూర శాంతమ్మ, తాటి జయలక్ష్మి లు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ చొరవతో తిరిగి ఇండియాకి..



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** విదేశాల్లో ఉపాధి నిమిత్తం వెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురైన కోనసీమ జిల్లా పిఠాపురం మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వలస కార్మికురాలు పళ్ళ సోమలమ్మను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రావిరాల చొరవతో సురక్షితంగా ఇండియాకు తీసుకురావడం జరిగింది. ధర్మవరం గ్రామానికి చెందిన పళ్ళ అరుణ్ కుమార్ తన తల్లి విదేశాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ (కెసిఎమ్) ద్వారా జిల్లా కలెక్టర్‌కి అర్జీ సమర్పించారు. ఫిర్యాదు ప్రకారం, పేద కుటుంబానికి చెందిన పళ్ళ సోమలమ్మ ఫిబ్రవరి 2025లో ఉపాధి నిమిత్తం మస్కట్ దేశానికి వెళ్లగా, అక్కడ పని చేసే చోట తీవ్ర శారీరక, మానసిక వేధింపులకు గురయ్యారు. సరైన ఆహారం, విశ్రాంతి లేకుండా చిత్రహింసలు పెట్టారని, ఇంట్లో నిద్రపోవడానికి కూడా అనుమతించకపోవడంతో బయట దోమల మధ్య, తేళ్ల భయంతో గడపాల్సి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ డా. మహేష్ కుమార్ రావిరాల, కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌కు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు కేసీఎం బృందం సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పళ్ళ సోమలమ్మను క్షేమంగా స్వదేశానికి తీసుకువచ్చినట్లు కేంద్ర నోడల్ అధికారి కె. మాధవి, సమన్వయ అధికారి గోళ్ళ రమేష్ తెలిపారు. విదేశీ ఉపాధి నిమిత్తం వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోనసీమ జిల్లా వలస కార్మికులు లేదా వారి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే, కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చని వారు విజ్ఞప్తి చేశారు.

# మహనీయులకు నివాళులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారికి నివాళులు అర్పిస్తున్నాం. నేడు ఆ మహనీయుని స్మరించుకుంటూ, ఆయన ఆదర్శాలను గౌరవిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆత్మార్పణ దినం నిర్వహిస్తుంది. సువిశాల భారతావని నిర్మాణానికి దిశా దశ చూపిన ఉక్కు మనిషి ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాం అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తెలియజేశారు.

## ఎడిటర్ వాయిస్

### ఏపీ అసెంబ్లీ సమావేశాలు వాయిదా.. ఎందుకంటే!

అనూహ్యంగా ఈ సమావేశాలు వాయిదా పడినట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎప్పుడు నిర్వహిస్తారు అనేది ఇంకా తేల్చలేదు అన్నది కూడా అధికార వర్గాలు చెప్పిన మాట. మరి దీనికి కారణం ఏంటి? ఎందుకు? అనేది ఆసక్తిగా మారింది. ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 16 నుంచి(మంగళవారం) ప్రారంభం కావాల్సి ఉంది. దీనికి సంబంధించి గతంలోనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటన చేశారు. డిసెంబర్ 16 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలను ప్రారంభిస్తామని చెప్పారు. కానీ, అనూహ్యంగా ఈ సమావేశాలు వాయిదా పడినట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎప్పుడు నిర్వహిస్తారు అనేది ఇంకా తేల్చలేదు అన్నది కూడా అధికార వర్గాలు చెప్పిన మాట. మరి దీనికి కారణం ఏంటి? ఎందుకు? అనేది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం కీలకమైన అంశాల్లో ప్రభుత్వానికి కొంత ఇబ్బంది అయితే ఎదురవుతున్న మాట వాస్తవం. అసెంబ్లీ సమావేశాలు పెడితే ఆయా అంశాలను ప్రస్తావించకుండా సభను ముగించడానికి అవకాశం లేదు. వీటిలో రాజధానికి చట్టబద్ధత అంశంపై బిల్లు చేయాల్సి ఉంది. రెండోది రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు మరింతగా పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. మద్దతు ధరలు, ఎరువులు, పురుగు మందులు అదేవిధంగా రైతులకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను అందించడంలో ఒకింత ప్రభుత్వం వెనకబడిందని చెప్పాలి. ఇది దేశవ్యాప్తంగా ఉన్న సమస్య అన్నది అధికారులు చెబుతున్న మాట. కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ వ్యవసాయానికి, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఎరువులు, పురుగుమందులు తగ్గించే దిశగా అడుగులు వేసింది. దీంతో ఉత్పత్తి అదేవిధంగా దిగుమతులు కూడా తగ్గించుకుంది. ఈ ప్రభావం ఏపీ సహా అన్ని రాష్ట్రాలపై పడింది. ఫలితంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక పంటలకు గిట్టుబాటు ధర కూడా లభించడం లేదన్నది వాస్తవం. ఇటీవల పత్తి విషయంలో చాలా ఇబ్బందికర పరిణామాలు ఎదురవగా కేంద్రానికి అనేక సందర్భాల్లో లేఖలు రాసినా స్పందించలేదు. అదే విధంగా ఇటీవల వచ్చిన తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు పరిహారం కూడా ఇంతవరకు ఇవ్వలేదు. ఈ అంశాలన్నీ అసెంబ్లీలో చర్చకి వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సమస్యలు పరిష్కరించడానికి మరో నెల రోజుల సమయం పట్టే ఛాన్స్ ఉన్న నేపథ్యంలో అవి పరిష్కారం అయ్యేవరకు వాయిదా వేయాలన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. అదేవిధంగా రాజధాని అమరావతిపై చట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. కానీ దీనికి సంబంధించి రాష్ట్రంలోనే బిల్లు తయారు చేసే పంపించాలని కేంద్రం చెప్పింది. ఎందుకంటే గతంలో సుప్రీంకోర్టులో కేసు పడినప్పుడు కేంద్రం తమకు సంబంధం లేదని, ఏపీ రాజధాని అంశం ఏపి ఇష్టమని దానిలో తాను జోక్యం చేసుకోలేమని చెప్పింది. ఇప్పుడు నేరుగా కేంద్ర ప్రభుత్వం దీనిపై చట్టం చేసే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బిల్లును తయారుచేసి కేంద్రానికి పంపిస్తే కేంద్రం దానిని ఆమోదించే అవకాశం ఉంటుంది. ఇక రాజధాని సరిహద్దుల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత కొరవడింది. గతంలో 33 వేల ఎకరాలను రైతుల నుంచి తీసుకున్నారు. 20,000 ఎకరాల ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. దీంతో మొత్తంగా 53 వేల ఎకరాలలో అమరావతిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పుడు మరో 46వేల ఎకరాలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇంకా పరిస్థితులు కొలిక్కి రాలేదు.



ఆయా సమస్యల నేపథ్యంలోనే అసెంబ్లీ సమావేశాలు ఇప్పటికిప్పుడు కాకుండా జనవరి రెండో వారం నుంచి నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఇక, వైసీపీ ఈ సమావేశాలకు కూడా వచ్చే అవకాశం లేదు. తమకు ప్రధాన ప్రతిపక్ష హొదా ఇస్తే తప్ప వచ్చే పరిస్థితి ఉండదని జగన్ ఇప్పటికే స్పష్టం చేశారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలి

**కార్మికుల జీవించే హక్కులు హరిస్తున్న 4 లేబర్ కోట్స్‌ను రద్దు చేయాలి**
**కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి - బొజ్జ రామకృష్ణ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్మికుల సమస్యల పరిష్కారానికి సంక్షేమ బోర్డులు వెంటనే పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణం కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో ఆదివారం క్వారీ మార్కెట్ అన్న క్యాంటీన్ వెనుక శ్రామిక భవనం లో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగినది. ఈ సమావేశంలో బొజ్జ రామకృష్ణ మాట్లాడుతూ 2018 నుండి సంక్షేమ బోర్డు పూర్తిగా మూతపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డులోకి కార్మికుల పేరు చెప్పి చెస్ విధానం వసూలు చేస్తూ ప్రభుత్వం ఆ సొమ్మును వేరే మార్గాలకు మళ్లిస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ అనగా మ్యారేజ్ స్కీమ్, డెలివరీ స్కీమ్, సహజ మరణం కు సంబంధించిన భీమ, ప్రమాద పరిహారం కావచ్చు కార్మికులకు అందడం లేదని అన్నారు. అలాగే ప్రమాదంలో మృతి చెందిన వారికి ఇచ్చే నష్టపరిహారం, కార్మికులకు వృత్తిపరమైన శిక్షణ పనిముట్లు, నేషనల్ అకాడమీ కోర్సులో శిక్షణ విధానం అమలు కావడం లేదని అన్నారు. కార్మికుల పిల్లలకు ఎడ్యుకేషన్ మెరిట్ అయినచో స్కాలర్షిప్ విధానం ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందని అన్నారు . రామచంద్రపురం కార్పెంటర్ అసోసియేషన్ అపర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరూ కూడా అన్ని యూనియన్లు కూడా మమేకమై ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే లీగల్ అడ్వైజర్ నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కార్మికులకు నాలుగు లేబర్ కోట్స్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంక్షేమ బోర్డుపై ఉన్నటువంటి కార్మికులకు ఫలాలను సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ లింగమల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మికుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోబోతున్నారని, సంక్రాంతికి సంక్షేమ బోర్డును దానిలో ఉన్న ఫలాలను విడుదల చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దానిలో భాగంగా క్వారీ మార్కెట్ సెంటర్ లో కార్మికులందరూ పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. అన్ని రకాల వృత్తుల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో గోదావరి ఎలక్ట్రికల్ వర్క్ యూనియన్ ప్రెసెంట్ బొజ్జ రామకృష్ణ, సెక్రటరీ ఆశపు శ్రీనివాస్ బుజ్జి, విశ్వకర్మ వడ్రంగి పని వాళ్ళ సంఘం ప్రెసిడెంట్ దేవగుప్త శ్రీనివాస్, సెక్రెటరీ వీరబాబు, రాజమహేంద్రవరం ప్లంబర్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కొండపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీ రాంబాబు, రాజరాజ నరేంద్ర పెయింటర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కూరపాటి రాజన్న రెడ్డి, వెంకటప్పలనాయుడు, బిల్డింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ బలుసు నాగేశ్వరరావు, సెక్రెటరీ రాజశేఖర్, విఘ్నేశ్వర బోర్డు సెంట్రింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ సుంకర వెంకటేశ్వరరావు, సెక్రెటరీ మీసాల గణేష్, కుమార్ రాడ్ బెండింగ్ అండ్ సెంట్రింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ ఆర్ వి మల్లేశ్వరరావు, అమలాపురం ఎలక్ట్రికల్ యూనియన్ జిల్లా నాయకులు కట్టా వెంకటరమణ, అమలాపురం తాపీ పని వాళ్ళ సంఘం ప్రెసిడెంట్ కృష్ణ, రామచంద్రపురం అప్పారి శ్రీనివాస్, వివిధ జిల్లాలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సి.ఆర్.ఎం.టిలకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలి

**22వ తేదీన విజయవాడలో ఆత్మగౌరవదీక్షను విజయవంతం చేయండి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, పదవి విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ప్రస్తుతం ఉన్న 23,500 వేతనాన్ని, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్లో బేసిక్ వేతనం 44,570 రూపాయలు పెంచాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలనే పలు డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్షుడు ఎం.రఘునాథ్, కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసా డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా జిల్లా సి.ఆర్.ఎమ్.టి.ల ఆత్మగౌరవ దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. రాష్ట్ర సి.ఆర్.ఎం.టి. యూనియన్ ఫోరం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద, విజయవాడలో 22వ తేదీన ఆత్మగౌరవ దీక్ష చేపట్టే డిమాండ్ల సాధనకు సమైక్యంగా పోరాడుతున్నామన్నారు. సి.ఆర్.ఎం.టి.లకు అదనపు పని భారం తగ్గించాలని, నిర్దిష్టమైన జాబు చారుటు, రవాణా చార్జీలు, డీఎస్సీ లో వెయిటేజ్ ఇవ్వాలని, ఫేషియల్ అటెండెన్స్ అన్ని పాఠశాలలో వేసే విధంగా అవకాశం కల్పించాలని, ప్రమాదవశాస్తూ మరణించిన ఉద్యోగులకు 10 లక్షల ఎక్స్రేషియా మరియు కుటుంబంలోని ఒక వ్యక్తికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాసం కల్పించాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదురుగా పలు డిమాండ్లు నినాదాలు చేస్తూ, కలెక్టర్ కార్యాలయంలో ప్రజా దర్బారు కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తికి వినతి పత్రం ఇచ్చారు ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆర్.పూసలరావు, ఉపాధ్యక్షుడు కే.ప్రసాద్, గౌరవాధ్యక్షులు జయంతి శాస్త్రి, జి.వెంకట రత్నం, కోశాధికారి ఇందిర, సహాయ కోశాధికారి ప్రియదర్శిని, మహిళా అధ్యక్షురాలు సురేంద్ర కుమారి, సభ్యులు వెంకట్, చినబాబు, శ్రీనివాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి పనుల నుండి అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజయం

**క్యాంస పతకం సాధించిన అర్జి బాలకృష్ణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ వేదిక అయిన టర్కీలో జరిగిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం గ్రామానికి చెందిన మున్సిపల్ కార్మికుడు ఆర్జి బాలకృష్ణ 74 కేజీల విభాగంలో స్క్వాడ్‌లో కాంస్య పతకం సాధించడం మన రాజమహేంద్రవరం నగరానికి గర్వకారణం. అంతర్జాతీయ స్థాయిలో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన బాలకృష్ణకు మనస్ఫూర్తిగా అభినందనలు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ తరఫున భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని కోరుకుంటున్నాము.

**ఘనంగా "జీమా"కళాకారుల**

## 9వ వార్షికోత్సవం ఆత్మీయ కలయిక





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి మూవీ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (జీ మా) ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక 9వ వార్షికోత్సవం స్థానిక ప్రభు గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీ మా సంస్థ గౌరవ అధ్యక్షులు నట గాయకులు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షత వహించగా జిమా అధ్యక్షుడు డి.యస్ శ్రీనివాస్,ఫౌండర్ మహేష్ తేజ్, పర్యవేక్షించగా సంస్థ కన్వీనర్ డా.గిరజాల సోమరాజునాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కళల కాణాచి రాజమహేంద్రవరం లో ఎప్పటికప్పుడు వర్ధమాన కళాకారులు రావడం ,పరిశ్రమలో రాణించడం శుభ పరిణామం అని ,వారికి తగిన వనరులు, అందించడం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానికంగా గోదావరి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటున్న చిత్రాలను ప్రోత్సాహిస్తామని, భరోసా ఇస్తూ సంస్థ సభ్యులను అభినందనలు తెలిపారు. మరొక ముఖ్య అతిథి జనసేన సిటీ ఇన్చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ పరిశ్రమలో రూపొందించబోయే సినిమాలు ఇరవై శాతం స్థానికంగా జరుపుకుంటే ఇక్కడ కళాకారులకి ఎక్కువ అవకాశాలు వస్తాయి అని ,ఆ సినిమాలకి ప్రభుత్వం తరపున కూడా తగిన రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీపాద జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి సినిమా స్టూడియో రాజమహేంద్రవరం లో ఉండేదని,మన గోదావరి జిల్లాలలో పలు విజయవంతమైన చిత్రాలను రూపొందించి తద్వారా కళాకారులు దర్శకనిర్మాతలు వెండితెరకి పరిచయమై రాణించారని గోదావరిమాత అనుగ్రహముతో మళ్ళీ రాజమహేంద్రవరంలో సినిమా పరిశ్రమకు పూర్వ వైభవం వస్తుందని ఆకాంక్షించారు. ఆత్మీయ అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి హారిక,దర్శకులు ఆనంద్ సాగర్,రాజ్ కుమార్ బాబి,చిరంజీవి రక్త దాన శిబిరం యువత అధ్యక్షుడు ఏడిద బాబి, నటులు మద్దు సూరిబాబు, జూనియర్ అక్కినేని ఎలుబండి రాజు పాల్గొని జీమా సంస్థ విజయవంతంగా 9 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గర్వించదగ్గ విషయం అని ఈ సంస్థ ద్వారా పలువురు వర్ధమాన కళాకారులు పరిశ్రమ రావాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. 2ఈ కార్యక్రమంలో జీ మా ఉపాధ్యక్షులు చక్రధర్, కోశాధికారి పిచ్చుక మహేష్, కార్యదర్శులు సురేంద్ర, రామ్ సాయి, పి.ఆర్.వో. గంగాధర్, ఈ.సి.మెంబర్లు కిషోర్,బి.వెంకటపతిరాజు, మహి,రవి,సతీష్, సీనియర్ సభ్యులు ఆర్.కె.సార్, జి.నరసింహమూర్తి, శ్రీపాద శంకర్ రావు,ఎ.జి.యం. శ్రీనివాస్, రవీంద్ర, వి.శ్రీనివాస్, కె.సత్యమూర్తి, కె.భారతి నాయుడు, అంబిక తదితరులు పాల్గొన్నారు .జీ మా సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు.

## గాంధీ శిల్ప్ బజార్ ప్రారంభం

**ఛైర్మన్, ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ హరి ప్రసాద్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గాంధీ శిల్ప్ బజార్ ప్రదర్శన,అమ్మకాలు కార్యక్రమాన్ని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, ఉమా రామలింగేశ్వర కళ్యాణ మండపంలో డిసెంబర్ 15 నుండి 21,2025 వరకు (7 రోజులు) నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ డా. పసుపులేటి హరి ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం జాంపేట లోని శ్రీ ఉమా రామలింగేశ్వర కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన గాంధీ శిల్ప్ బజార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం నలుమూలల నుంచి వచ్చిన సుమారు 40 మంది ప్రతిభావంతులైన హస్తకళాకారులు ఈ గాంధీ శిల్ప్ బజార్‌లో పాల్గొని, తమ స్వయంకృషితో తయారు చేసిన సంప్రదాయ హస్తకళా ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం కల్పించబడిందని తెలిపారు. మధ్యవర్తులు లేకుండా ప్రత్యక్ష అమ్మకాలు జరగడం వల్ల కళాకారులకు న్యాయమైన ధర లభిస్తుందని, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ గాంధీ శిల్ప్ బజార్‌ను భారత ప్రభుత్వ టెక్స్టైల్స్ మంత్రిత్వశాఖ డెవలప్‌మెంట్ కమిషనర్ (హ్యాండీక్రాఫ్ట్), న్యూఢిల్లీ వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ ప్రదర్శనలో కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి బ్లాక్ ప్రింటింగ్, పెన్ కలంకారి, వుడ్ కార్వింగ్స్, క్రోషే లేస్, లెదర్ పప్పెట్స్, ఇమిటేషన్ జువెలరీ, డర్రీలు, కార్పెట్లు, టై అండ్ డై వస్త్రాలు, డ్రై ఫ్లవర్స్, హ్యాండ్ ప్రింటెడ్ టెక్స్టైల్స్, మధురై సంగుడి, పిప్లి అప్లిక్ వర్క్ వంటి విభిన్న సంప్రదాయ హస్తకళా ఉత్పత్తులు విక్రయానికి ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హస్తకళాకారులకు మార్కెట్ విస్తరణ, అమ్మకాల ప్రోత్సాహం, భారతీయ హస్తకళల పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డా. పసుపులేటి హరి ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, హస్తకళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ గాంధీ శిల్ప్ బజార్ ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు, ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవులు సహా ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని మీడియా సోదరులను ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ ఎం, ఓఎస్డీ ఐ.వి.లక్ష్మీనాథ్,అసిస్టెంట్ మేనేజర్ సి.హెచ్. వీరబాబు,అసిస్టెంట్ డైరెక్టర్ (డీసీహెచ్) ఎన్. అపర్ణ లక్ష్మి,సుబ్రహ్మణ్య దేవస్థానం ఛైర్మన్ వై.వి.డి.సి. ప్రసాద్, జనసేన నేతలు అత్తి సత్యనారాయణ (అనుశ్రీ), వై. శ్రీనివాస్,రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రియా సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

**డిసెంబర్ 21న పిల్లలందరికీ**

## పోలియో చుక్కలు వేయించండి

**జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం - కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరించిన డిఆర్ఓ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో డిసెంబర్ 21, 2025 (ఆదివారం)న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారామ మూర్తి మాట్లాడుతూ, అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు లోపు పిల్లలందరికీ ఒక విడత పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. భారతదేశంలో ప్రస్తుతం పోలియో కేసులు నమోదు కాకపోయినా, పొరుగు దేశాలలో ఇంకా పోలియో కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల 1,89,550 మంది పిల్లలను లక్ష్యంగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 1,084 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణంలో ఉన్న పిల్లల కోసం ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో 62 ట్రాన్సిట్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పట్టణ మురికివాడలు, వలస కార్మిక ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు తదితర హై రిస్క్ ఏరియాలలో పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి 53 మొబైల్ టీంలు నియమించినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో డిసెంబర్ 19, 20 తేదీలలో మైకులు, ప్రచార సాధనాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 21న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పల్స్ పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, అలాగే డిసెంబర్ 22, 23 తేదీలలో పల్స్ పోలియో టీంలు ఇంటింటికి వెళ్లి, 21న పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి వారికి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం 46,852 మంది టీమ్ మెంబర్లను నియమించామని, కార్యక్రమ పర్యవేక్షణకు 10 మంది మానిటరింగ్ అధికారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, పురపాలక, రెవెన్యూ, మత్స్య శాఖలతో పాటు అన్ని లైన్ డిపార్ట్మెంట్లు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు, జిల్లా కుటుంబ సంక్షేమ శాఖాధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ పి.పద్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విజయవంతంగా మాల బంధు వన విందు

**డాక్టర్ అంబేద్కర్ పేరిట విశిష్ట సేవారత్న అవార్డును ఉల్లం రవికి అందజేత**



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** హలో మాల.. ఛలో గుంటూరు... కార్యక్రమంలో భాగంగా మాల మహానాడు, మాల మహాసభల అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్, మల్లెల వెంకటరావుల ఆధ్వర్యాన స్థానిక గుంటూరు నల్లపాడు పోలీస్ స్టేషన్ గొర్లి వారి పాలెం కోటి గార్డెన్స్ నందు ఆదివారం ఉదయం నుండి మాల బంధు వన విందు పేరిట జరుగు మాలల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. మాల సంఘాల నాయకులు, కులపెద్దలు, ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ నాయకులకు ఈ కార్యక్రమంలో మాలజాతి అభివృద్ధి కోసం కృషి చేస్తున్న రాష్ట్ర నాయకులు 200 మందికి డాక్టర్ అంబేద్కర్ విశిష్ట సేవారత్న అవార్డులు ప్రదానం చేసారు. 15మంది మాల కవులకు కుసుమ ధర్మన్న, బోయి భీమన్న, పైడి తేరేష్ బాబు, కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు స్మారక సాహిత్య అవార్డులు అందజేశారు.

దళితుల భూమిని ఆక్రమించుకున్న

# భూస్వాములపై చర్యలు తీసుకోవాలి

**దళితుల భూములు తిరిగి దళితులకు అప్పగించాలి - కేవీపీస్, వ్యవసాయ, కార్మిక సంఘం డిమాండ్**





**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, తుమ్మలపల్లి గ్రామం లోని ఆరుగురు దళితులైన కుటుంబాలకు చెందిన 'డి-ఫామ్' భూమిని కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన కొందరు గుత్తుల సత్యనారాయణ కుమారుడు నాగరాజు, దుర్గ ప్రసాద్‌లు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ, సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ సెట్టుకన్వీనర్ శెట్టి బత్తుల తులసిరావు, మాట్లాడుతూ 1975 సంవత్సరాల ముందు ఉమ్మడి గ్రామపంచాయతీ అయిన కొమరగిరిపట్నంలో తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పేద దళితులైన 12 మంది కుటుంబాలకు అప్పట్లో ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఒక్కో కుటుంబానికి 94 సెంట్లు భూమిని ఇవ్వడం జరిగిందని, ఈ భూమిని కొమరగిరిపట్నం కడదరి ప్రాంతంలోని సర్వే నెం. 1025-1హెచ్ తదితర సర్వే నెంబర్లలో భూమిని పేదలకి అప్పగించడం జరిగింది. అప్పట్నుంచి కొంతకాలం వారి స్వాధీనంలో సాగు చేసుకున్నారని, ఈ భూమికి 1982 వరకు పన్నులు కూడా చెల్లించిన రికార్డులు ఉన్నాయి. అయితే, అనారోగ్యం, అవగాహన లేమి కారణంగా కొంత కాలం సాగుకు దూరంగా ఉండటాన్ని ఆసరాగా తీసుకుని, కొమరగిరి పట్టణానికి చెందిన గుత్తుల సత్యానారాయణ కుమారులు గుత్తుల నాగరాజు మరియు గుత్తుల దుర్గారావు అను వ్యక్తులు ఆ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు. వారు అబద్ధపు 'లీజు పత్రాలు' సృష్టించి, పేద కుటుంబాలపై బెదిరింపులకు దిగి అక్రమంగా భూమిని అనుభవించడాన్ని కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకొని, తప్పుడు పత్రాలు సృష్టించిన ఆక్రమణదారులు గుత్తుల సత్య నారాయణ కుమారులు గుత్తుల నాగరాజు మరియు గుత్తుల దుర్గారావులపై క్రిమినల్ చర్యలు తీసుకుని, బాధిత దళిత కుటుంబాలకు తిరిగి భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు. గతంలో బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అప్పటి అల్లవరం మండల రెవెన్యూ అధికారి గ్రామాన్ని సందర్శించి, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి, భూమిని బాధితులకు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఎమ్మార్వో బదిలీ కావడంతో ఆ సమస్య పరిష్కారం మధ్యలోనే ఆగిపోయింది. తక్షణమే జిల్లా కలెక్టర్ కలగజేసుకుని బాధిత పేద దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం చేస్తున్న భూస్వాములపై చర్యలు తీసుకోకపోతే, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు .తక్షణం భూమిని పేదలకు ఇవ్వాలని నిర్లక్ష్యం వహిస్తే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైనటువంటి భూమిని స్వాధీనం చేసుకుని అర్హులైన దళిత పేద కుటుంబాలకు సంఘం ఆధ్వర్యంలో అప్పగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ సెట్టి బత్తుల తులసిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, చింతా వీరప్రసాద్, యలమంచిలి రమేష్, బల్ల శ్రీనివాస్, యలమంచిలి మోహన్ రావు, బల్ల నాగరాజు, చెవల సురేంద్ర, నాతి సూర్యనారాయణ మూర్తి, మాకే లోకేష్, విప్పర్తి వర ప్రసాద్, పొలమూరి శ్రీనివాస్, కుంచే రెడ్డిబాబు, కుంచే సహదేవుడు, కుంచే వర్మ, కుంచే సురేష్, కుంచే రమేష్, కాకర అర్జున్ రావు, చింతాదేవి, యలమంచిలి మణి, బల్లా చంద్రకాంతం, బల్ల నాగవేణి, వడ్డి అధిలక్ష్మి, కుసుమే మణిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి రాష్ట్ర కార్యాలయానికి చేరిన కోటి సంతకాలు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల నుంచి మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జిల్లా నియోజకవర్గల నుంచి సేకరించిన పత్రాలను రాష్ట్ర కార్యాలయానికి చేర్చడంతో ప్రజా ఉద్యమం విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి అమలాపురం పార్లిమెట్ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ ,జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అమలాపురం నియోజకవర్గ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, బొమ్మి ఇశ్రాయేల్, కుడుపూడి సూర్యనారాయణ రావు, రాజోలు నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి,సూర్యారావు, ముమ్మిడివరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్,రామచంద్రాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, అమలాపురం పార్లిమెంట్ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి, అమలాపురం నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపరాయుడు, నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

కోటి సంతకాల సేకరణ ప్రతులను జండా ఊపి పంపించిన

# జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో కదం తొక్కిన అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్సీపీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో భారీ ర్యాలీ జై జగన్ జై జగన్ అంటూ నినాదాలతో దద్దరిల్లిన అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ముగించుకుని కోటి సంతకాల సేకరణ ప్రతులను జెండా ఊపి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్దకు పంపిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసిన జంగా గౌతమ్



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ని ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ కోఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన జంగా గౌతమ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఓటు చోరీ గద్దీ చోడ్ బహిరంగ సభ అనంతరం మల్లికార్జున ఖర్గేను కలుసుకుని తనకు ఏఐసిసి ఎస్సి విభాగంలో జాతీయ కో ఆర్డినేటర్‌గా నియమించినందుకు ఖర్గేకి జంగా గౌతమ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఖర్గే ఆదేశించినట్టు జంగా గౌతం తెలిపారు. కేంద్రంలోని బీజేపీ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పూర్తిగా తీసివేసేందుకు కుట్రలు చేస్తుందని.. కనుక కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో జరుగుతున్న రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో దళితులను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేయాలని ఖర్గే చెప్పినట్టు జంగా గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్ నందు ఘనంగా

# పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి వేడుకలు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు ప్రజల హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన మహానుభావుడు పొట్టి శ్రీరాములనీ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి ఆత్మార్పణ దినాన్ని పుర స్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు అలంకరించి పుష్ప గుచ్చాలతో అధికారకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాభిమానం, త్యాగం, సంకల్ప బలం ఆయన జీవనానికి ప్రతీకల న్నారు. ఆయన అమర త్యాగం వల్లే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం అవతరించిందన్నారు. అలాంటి మహానీయుడిని ఈ వర్ధంతి రోజున స్మరించుకుంటూ ఆయన ఆశయాలను మన జీవి తాల్లో నిలుపుకోవడం ఆయనకు మనం అర్పించ గలిగే నిజమైన నివాళి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భాన, ఆయన మహోన్నత త్యాగ స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆ మహా నీయునికి మా హృదయ పూర్వక వినమ్ర నివాళులు అర్పిస్తున్నామన్నారు. తెలుగు భాష మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన ఆయన త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు ఆయన చూపిన సత్యం, అహింస, సేవా మార్గం నేటి తరాలకూ నిత్యస్ఫూర్తిగా నిలుస్తోం దన్నారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు దిశగా మార్గ దర్శకుడైన పొట్టి శ్రీరాములు ఆకాంక్షించిన సమానత్వ భరిత, న్యాయ సమాజ నిర్మాణం కోసమే మనమందరం కృషి చేయడం ఆయనకు అదించే నిజమైన స్మరణ అన్నారు పొట్టి శ్రీరాములు అమరత్వం పొందిన ఈ వర్ధంతి దినాన ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన ఆశయాల సాధన లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత ముందంజ వేయాలని కోరుకుంటూ అమరజీవి పొట్టి శ్రీరాములు 73 వ వర్ధంతి సందర్భంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల పథనిర్దేశకుడు పొట్టి శ్రీరాములు, అమర జీవి పొట్టి శ్రీరాములు త్యాగం, పట్టుదల నిరూప మానమన్నారు.తన జీవితం మొత్తాన్ని భారతమాత సేవకు, ఆరోజుల్లోని వివక్షను తొలగిం చడానికి, దళిత ప్రజల దేవాలయ ప్రవేశానికి, కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించడంతో పాటు తెలుగు వాళ్లకు ప్రత్యక రాష్ట్రం కోసమే తన జీవితాన్ని అంకితం చేసి, అమ రజీవిగా చరిత్ర పుటలలో నిలిచిపోయారన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 1952 అక్టోబర్ 19న నిరాహార దీక్షను చేపట్టి, 58 రోజుల పాటు కొనసాగించి, 1952 డిసెంబర్ 15న ఆయన అసువులు బాసారన్నారు. ఆ తర్వాత 4 రోజులకు ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారన్నారు. ఆయన ఉద్యమ ప్రభావ ఫలితమే దేశం మొత్తం మీద బాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. ఆయన ఆత్మార్పణ చేసిన డిసెంబర్ 15వ తేదీన పవిత్ర మైన దినంగా భావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన జీవో తీసుకుని రావడం అభి నందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఓ కే మాధవి, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, సూపరిం టెండెంట్ సుబ్బరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడడమే

# రాబోయే తరాలకు మనమిచ్చే బహుమతి

**ఐటిసి, వాస్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమం**
**పలు సూచనలు చేసిన మొబైలైజ్ కోఆర్డినేటర్ రాజబాబు**




**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాన్ని స్వచ్ఛత కలిగిన, ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరు భాధ్యత వహించి,సహ కరించాలని కొప్పవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి బుల్లబ్బాయి సూచించారు. తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, కొప్పవరం గ్రామంలో ఇండియన్ టుబాకో కంపెనీ (ఐ.టి.సి), ఎమ్మెస్కే వాష్ ఇన్స్టిట్యూట్ ఆద్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం, తడిచెత్త, పొడిచెత్త నిర్వహణ పై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాష్ ఇన్స్టిట్యూట్ కమ్యూనిటీ మొబైలైజ్ కోఆర్డినేటర్ పి.రాజబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులపై అధికంగా ఆధారపడడం వలన ప్రకృతి తో పాటు, మానవ ఆరోగ్యం కూడా క్రమంగా చెడిపోతుందని వివరించారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు ప్లాస్టిక్ కారకంగా మారుతుందని హెచ్చరించారు. ఇళ్ళ లోని వ్యర్థాలతో గ్రామ సంపద తయారీకి అందరూ సహకరించాలని దీనికొరకు తడిచెత్త, పొడిచెత్తను వేరు వేరుగా భద్రపరిచి శానిటేషన్ సిబ్బంది లేదా గ్రీన్ గార్డ్స్ కు అందించాలని వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి బుల్లబ్బాయి మాట్లాడుతూ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇది రాబోయే తరాలకు మనమిచ్చే బహుమతి అని అన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించి గ్రామంలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎ.పి.ఎమ్ టి.సీతారత్నం, సి.సి వి.రాజబాబు, ఎస్.పెరునాయుడు, ప్రాజెక్టు ఆఫీసర్ లోకరాజు గ్రామ మహిళలు, పంచాయతీ సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.

ఐమైండ్స్ జూనియర్ కాలేజ్‌లో

# మెగా స్కాలర్షిప్ టెస్ట్‌కు విశేష స్పందన

**1300 మంది విద్యార్థుల హాజరు**




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఐమైండ్స్ జూనియర్ కాలేజ్‌లో ఆదివారం నిర్వహించిన మెగా స్కాలర్షిప్ టెస్ట్‌కు విశేషమైన స్పందన లభించింది. అధిక సంఖ్యలో వివిధ మండలాల నుండి హాజరైన విద్యార్థులు పేద, మధ్య తరగతి నుండి వచ్చి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను పరీక్షలో ఉత్తీర్ణత శాతం ఆధారంగా స్కాలర్ షిప్, ఫీజు లో అధిక రాయితీలు కల్పించి కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ మెగా స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇర్ఫాన్, తెలిపారు. ఇందులో భాగంగా దాదాపు 250 స్కూళ్ల నుండి విద్యార్థులు హాజరు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్య, డీన్ గోపాల్, సెక్రటరీ సాధక హుస్సేన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణత్యాగంతో ఉమ్మడి ఆంధ్రరాష్ట్రం సాధించిన

# ఘనులు పొట్టి శ్రీరాములు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష, ప్రాణత్యాగం తోనే ప్రత్యేక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించారని రాయవరం మండల డిప్యూటీ ఎంపీడీవో యం.శ్రీనివాసరావు, పరిపాలనాధికారి వై.యన్.యన్ గోపాల్, డిప్యూటీ ఎంపీడీవో (జి.ఎస్.డబ్ల్యూ.ఎస్) వి.వి.ఆర్ కృష్ణంరాజులు పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పొట్టిశ్రీరాములు త్యాగాలను గుర్తుచేసుకుని ఆయనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్.జి.ఎన్.ఆర్. ఇ.జి.ఎస్ ఎపివో సుధారాణి, హౌసింగ్ ఏఈ దాసు, లేబర్ ఆఫీసర్ సత్యవేణి లు మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో కలిసి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

# చింతారావుకు ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన పాశం చింతారావు యాదవ్‌కు రావులపాలెం ఎల్ఐసి ఏజెంట్లు యూనియన్ ఆర్థిక సహాయం అందించింది. కుడిచేతి కాలర్‌బోన్ విరిగిపోవడంతో ఆయన ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా రావులపాలెం ఎల్ఐసి ఏజెంట్లు అసోసియేషన్ అధ్యక్షుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాయుడు వెంకట్రావు ఆధ్వర్యంలో ఎల్ఐసి ఏజెంట్లు చింతారావును పరామర్శించారు. అనంతరం ఆయనకు రూ.5,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెరవలి వెంకటేశ్వరరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, డి.ఆర్.కె.రాజు,ట్రెజర్ సూరంపూడి శ్రీనివాసరావు, సీనియర్ ఏజెంట్ గంధం నరసింహమూర్తి పలువురు ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

సిఆర్‌యం టీచర్‌ల హక్కుల సాధనకై

# కలెక్టరేట్ వద్ద ధర్నా




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిఆర్ఎంటి ఉద్యోగులు తమ వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు గతంలో ఇచ్చిన సమ్మె హామీలను అమలు చేయాలని అలాగే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు క్లస్టర్ బదిలీలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నామాడి వెంకట్రావు మెండు శ్రీనుబాబు నాగన్న అనూష తదితరులు పాల్గొన్నారు వీరికి నిరసనకు సంఘీభావంగాలో పాల్గొన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొరబాబు, కళ్యాణ్ బాబు పల్లంరాజు, నాన్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆప్త అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షబ్బీర్ హుస్సేన్, షానవాజ్ హుస్సేన్ మాజింద్రాణి సంఘీభావం ప్రకటించారు.

నేటి నుండి మండలంలో

# "ఫ్యామిలీ బెనిఫిట్ కార్డ్ సర్వే"

**ఇంటింటికి తిరిగి సమాచారం సేకరించనున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు**
**సర్వేపై శిక్షణనిచ్చిన మండల జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అధికారి వి.వి.ఆర్.కృష్ణంరాజు**




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమం, అభివృద్ధిని దగ్గర చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందించ బోతున్న ఫ్యామిలీ బెనిఫిట్ కార్డ్ సర్వేపై వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు మండల కేంద్రమైన రాయవరంలో గల మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అధికారి వి.వి.ఆర్.కృష్ణంరాజు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మండల వ్యాప్తంగా ప్రతీ ఇంటిని సందర్శించి, ప్రజల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారని, ఇంటింటికీ వెళ్లి కుటుంబాల ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ వివరాలు ఈ సర్వే ద్వారా నమోదు చేస్తారన్నారు. ఈ సమాచారంతో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు చేరడంతో పాటు, ఫ్యామిలీ బెనిఫిట్ కార్డ్ జారీ చేయడం సులభతరం అవుతుందని, ఈ సర్వే డిసెంబర్ 15 నుంచి జనవరి 12వ తేదీ వరకు కొనసాగుతుందని డిప్యూటీ ఎంపీడీవో కృష్ణంరాజు తెలిపారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ
జిల్లా ఎడిషన్
మంగళవారం, 16 డిసెంబర్ 2025
www.viswamvoice.com



# రజక కమ్యూనిటీ హాల్ రజకులకే అప్పగింపు..

## సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చొరవతో సమస్యకు పరిష్కారం



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలోని 44వ డివిజన్ శారదమ్మ గుడి సమీపంలో నిర్మించిన రజక కమ్యూనిటీ హాల్ ఎట్టకేలకు రజక సంఘం సభ్యులకు దక్కింది. సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చొరవతో ఈ హాల్‌ను రజకుల వినియోగానికి అప్పగించారు. రజకులకు కేటాయించి నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తై ఏళ్లవుతున్నప్పటికీ, కార్పొరేషన్ అధికారులు దానిని ఎన్నికల కార్యాలయంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకే కేటాయించిన భవనాన్ని తమకు అప్పగించాలని సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సమక్షంలో రజక సంఘం నాయకులు ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం అనంతరం రజక సంఘం నాయకులతో కలిసి ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణతో కలిసి కమ్యూనిటీ హాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు కమ్యూనిటీ హాల్‌కు రిబ్బన్ కట్టి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, రజక కమ్యూనిటీ హాల్‌ను ప్రతి ఒక్కరూ చక్కగా నద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కమ్యూనిటీ హాల్ పేరు రజకులదైనప్పటికీ, అన్ని వర్గాల ప్రజలు కూడా దీనిని వినియోగించుకోవాలని కోరారు. కమ్యూనిటీ హాల్‌ను రజకులకు అప్పగించిన సందర్భంగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును రజక సంఘం నాయకులు, పెద్దలు ఘనంగా సత్కరించారు. అలాగే పార్టీ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరును కూడా సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, రజక సంఘం నాయకులు బల్లంకి నూకరాజు, పిడుగు వెంకట రమణ, వీరబాబుమల్లి, కోరమంచెల సత్యనారాయణ, శీలం అప్పారావు, 44వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి బొల్లోజు ఉమామహేశ్వరరావు, డివిజన్ ప్రెసిడెంట్ బల్లంకి రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు అంకమ్మ రెడ్డి రామునాయుడు, కలిదిండి సురేష్, బూత్ ఇన్‌చార్జి దార్ల సుబ్బారావు, జనరల్ సెక్రటరీ ముల్లేటి సత్తిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పుట్ట సతీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనంకై పోరాడుదాం...

## రంగరాయ మెడికల్ కాలేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభ




**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ ఔట్సోర్సింగ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభ స్థానిక సాంబమూర్తి నగర్, రెవెన్యూ కాలనీ రోడ్ దుర్గమ్మ గుడి పక్కన పి.ఆర్ భవన్లో సోమవారం సాయంత్రం వనమాడి కాటవేణి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, వైద్య విధాన, ఏరియా, పి హెచ్ సి, సిహెచ్‌సి, మెడికల్ కాలేజీలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎందులో పని చేసిన పని విధానం ఒకటేనని, సమయం ఒకటేనని, కార్మికుల శ్రమను దోచుకోకుండా శ్రమకు తగ్గిన ప్రతిఫలం మంజూరు చేయాలని ఆయన అన్నారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో శానిటేషన్ కార్మికులకు 13960 రూపాయలు మంజూరు చేస్తూ, చేతికి 800 రూపాయలు అందజేస్తు న్నారని, అదేవిధంగా అన్ని చోట్ల వేతనాలు అమలు చేయాలని కార్మికుల్లో విభేదాలు చూపించొద్దని ఆయన అన్నారు. ప్రభుత్వ అధికారులు, వైద్యశాఖ అధికారులు, మంత్రులు సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారంగా 138వ జీవో ప్రకారంగా శానిటేషన్, సెక్యూరిటీ, పేస్ట్ కంట్రోల్ కార్మికులకు 18600 రూపాయలు మంజూరు చేయాలని, దీనిలో కమిషన్లు పోగా 16 వేల రూపాయలు మంజూరు చేయగా అందులో ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్కర్ ఖాతా నుండి మినహాయించుగా 14 వేల రూపాయలు జీతాలు మంజూరు చేయాలని, కానీ జీవో ప్రకారంగా జిజిహెచ్ లో తప్ప ఎక్కడ అమలు చేయడం లేదని జిల్లా వ్యాప్తంగా ఒకే విధంగా సమాన పనికి సమాన వేతనాలు మంజూరు చేయాలని ప్రసాద్ అన్నారు. రంగరాయ మెడికల్ కాలేజ్‌లో అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘంగా 20 21 లో ఏర్పాటు చేశామని ఇది రెండవ ద్వితీయ మహాసభని ఆయన అన్నారు. శానిటేషన్ కార్మికులకు ఏ కష్టం వచ్చినా, జీతాలు సక్రమంగా అమలు, పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా చెల్లించ లేకపోయినా ఏఐటీయూసీ వారికి అండగా ఉంటూ కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం పోరాడుతుందని ప్రసాద్ అన్నారు. బొబ్బిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ రంగరాయ మెడికల్ కాలేజ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తరపున అభినందనలు తెలియజేస్తున్నామని, ఏ సమస్యలు వాటి పరిష్కారానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మద్దతు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మి బాలకృష్ణ, కాటవేని, శివకుమార్, మోహన్, రామలక్ష్మి, సత్య, ఆంటోనీ రామారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

# సిద్ధార్థ నగర్ పార్క్ సమస్యల పరిష్కారానికి చర్యలు

## ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలోని సిద్ధార్థ నగర్ పార్క్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం డివిజన్ పర్యటనలో భాగంగా ఆయన ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులో పర్యటించి శానిటేషన్ నిర్వహణ పనులను పరిశీలించారు. అనంతరం సిద్ధార్థ నగర్‌లోని పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్ అభివృద్ధి కమిటీ సభ్యులు పార్కులోని సమస్యలను ఇంచార్జ్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. పార్కు ప్రహరీ గోడకు రంగులు వేయాల్సిన అవసరం ఉందని, శానిటేషన్ నిర్వహణ మెరుగుపరచాలని, పిల్లలు ఆడుకునేందుకు ఉన్న క్రీడా సామాగ్రి పూర్తిగా పాడైపోయిందని, కొత్త ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, డివిజన్ పర్యటనలో భాగంగా సిద్ధార్థ నగర్ పార్కును సందర్శించడం జరిగిందన్నారు. పార్క్ అభివృద్ధి కమిటీ సభ్యులు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. పార్కు ప్రహరీ గోడకు రంగులు స్వయంగా వేయడానికి కమిటీ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఇదే విధంగా కాకినాడ నగరంలోని ఇతర ప్రాంతాల్లోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కూడా తమ ప్రాంతాల్లోని పార్కుల అభివృద్ధికి ముందుకు రావాలని సూచించారు. అనంతరం ఆయన డివిజన్‌లో విస్తృతంగా పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే సిద్ధార్థ నగర్ రోడ్ నంబర్-2లోని శ్రీ వంగా గీత విశ్వనాథ్ పార్కును సందర్శించి అక్కడ అసంపూర్తిగా నిలిచిన భవనాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు వై.డి. రామారావు, సిద్ధార్థ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేక సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# హలో యువత మేలుకో చెడు వ్యసనాల నుంచి నిన్ను కాపాడుకో...

## గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కాకినాడ ఎస్పీ ఆఫీసులో అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హలో యువత మేలుకో చెడు వ్యసనాల నుంచి నిన్ను నువ్వు కాపాడుకో అనే కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరిగింది అందులో భాగంగా కాకినాడలో కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ గారి చేతుల మీదగా గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిచోట్ల యువత మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని చాలాచోట్ల గంజాయి కున్ని మత్తు పదార్థాలను అరికట్టామన్నారు విద్యార్థులు యువకులు మేలుకొని మత్తు పదార్థాలకు బానిసలు అవ్వకుండా మిమ్మల్ని మీరే కాపాడుకోవాలని అన్నారు అలాగే మత్తు పదార్థాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు, ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలై దాని నుంచి బయట పడాలనుకుంటే కౌన్సిలింగ్ ఇచ్చి వైద్యం చేస్తామని దానిద్వారా మత్తు పదార్థాల నుంచి బయటపడి మీ భవిష్యత్తు బాగుంటుందని అన్నారు ఏఐవైఎఫ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా అభినందించారు ఏ వైపు రాష్ట్ర సహాయ కార్యదర్శి వై బాబి మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు మత్తు పదార్థాలకు విద్యార్థులు యువకులు బానిసలు అవుతున్నారని అలాంటి వారు ఎవరైనా మా ఏఐవైఎఫ్ ద్వారా పోలీస్ వారు సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి ఉచిత వైద్యం చేపించి వాళ్ళని పూర్తిగా మారడానికి అవకాశం ఉందన్నారు తల్లిదండ్రులు వెంటనే స్పందించి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. దాని ద్వారా మీ పిల్లలు భవిష్యత్తు కోసం మీరు కన్న కలలు నెరవేరుతాయి అని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎం,వీరబాబు, సోషల్ మీడియా కన్వీనర్ ప్రభు తేజ, సిద్దు, విజయ్‌లు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో హాజరైన సిటీ ఎమ్మెల్యే వనమాడి




**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరపాలకసంస్థ అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పిర్యాదుల స్వీకరణ కార్యక్రమం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. నగరపాలక సంస్థ ఇంచా ర్జ కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వయంగా పాల్గొని, పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 70 మంది అర్జీదారులు తమ సమస్యలను ఎమ్మెల్యే సమక్షంలో ఇంచార్జ్ కమిషనర్‌కు తెలియజేశారు. ప్రతి పిర్యాదుపై సంబంధిత శాఖాధికారులతో తక్షణమే సమీక్ష నిర్వహించి, సమస్యల మూలకారణాలను గుర్తించి శాఖల మధ్య సమన్వయంతో పరిష్కారం సాధించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలకు చేరువయ్యే పరిపాలన విధానమే నిజమైన పాలనకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ ప్రజా పాలనలో జవాబుదారీతనం, పారదర్శకత పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని, సమస్యల పరిష్కారం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యతాయుత పరిపాలనకు ఈ కార్యక్రమం దిశానిర్దేశం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాస్, ఎస్ఈపీ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్‌వో శైలజ, ఈఈ కనకారావు, ఏసీపీ శ్రీధర్, విద్యుత్ శాఖ ఈఈ, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆంధ్రలో 1378 పాఠశాలల్లో

# నైపుణ్య విద్య అమలు

## ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1378 పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వం నైపుణ్య విద్య అమలు చేస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి వెల్లడించారు. జాతీయ విద్యా విధానం -2020 క్రింద పాఠశాలలో అమలు చేస్తున్న వృత్తి విద్య అమలు, నిధులు వినియోగంపై కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. జాతీయ విద్యా విధానం-2020 సూచన మేరకు అన్ని పాఠశాలల్లో సమగ్ర శిక్ష పథకం ద్వారా దశలవారీగా వృత్తి విద్యను ప్రధాన విద్యా వ్యవస్థలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 3.03 కోట్ల మంది విద్యార్థులు ప్రీ-ఒకేషనల్ విద్యను అందించడంతోపాటు బ్యాగ్స్ లెస్ డే లల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందిస్తుండగా, ఏపీ లో 2022-23 లో 1.01 లక్షలు, 2023-24 లో 8.25 లక్షలు, 2024-25లో 1.80 లక్షలు మంది విద్యార్థులకు వృత్తి విద్యను అందించామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నైపుణ్య విద్యను అమలు చేసేందుకు 1578 పాఠశాలలకు అనుమతి ఉండగా,ప్రస్తుతం1378 పాఠశాలల్లో అమలు జరగడంతో పాటు సమగ్ర శిక్ష పథకం కింద స్కిల్ ల్యాబ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, వృత్తి విద్య అమలుకు ఆంధ్రప్రదేశ్ కు గత ఏడాది 97.70 లక్షలు, ఈ ఏడాది 81.57 లక్షలు మంజూరు చేయగా కేటాయించిన నిధులు వినియోగాన్ని 'ప్రబంధ్' పోర్టల్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి వివరించారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# యుఐడిఎఐ ఆధార్ సేవ కేంద్రం పునః ప్రారంభం



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ స్థానిక బాలా త్రిపుర సుందరి ఆలయం ఎదురుగా యుఐడిఎఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఆధార్ సేవ కేంద్రం నూతన సాంకేతిక హంగులతో సోమవారం చిన్నారులచే, ఆధార్ సేవల వినియోగదారుల సమక్షంలో పునః ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుఐడిఎఐ హైద్రాబాద్ ప్రాజెక్టు మేనేజర్ షేక్ జావీద్ ప్రారంభం చేశారు. యుఐడిఎఐ ఆధార్ సేవ కేంద్రం మేనేజర్ కె.శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ ప్రజలకు ఆధార్ సంబంధిత సేవలను మరింత సులభతరంగా చేరువ చేసే ఉద్దేశంతో ఆధార్ సేవ కేంద్రంలో సాంకేతికతను పునరుద్ధరించేందుకు గత నెల 27వ తేదీ నుంచి నుండి ఈ రోజు వరకు మూసి వేసామన్నారు. మరలా నూతన సాంకేతికతతో సోమవారం సేవలను పునః ప్రారంభించడం చాలా సంతోషం కలిగించిందని, ప్రజలందరూ తన ఆధార్ సేవ కేంద్రంకి విచ్చేసి సద్వినియోగపరచుకొని వారి ఆధార్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఆధార్ సేవ కేంద్ర ఆపరేషన్స్ మేనేజర్ శశిధర్ కుమార్, సాయి, భాస్కర్ సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

### శిక్షణ దిగ్విజయంగా

# పూర్తి చేయండి : జిల్లా ఎస్పీ



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 22 తేదీన ప్రారంభం కానున్న ప్రత్యేక శిక్షణ విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. శిక్షణ నిమిత్తం కాకినాడ జిల్లాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులు మరియు వారి తల్లిదండ్రులతో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. శిక్షణకు సంబంధించి ప్రాముఖ్యత, క్రమశిక్షణ, శారీరక మరియు మానసిక సిద్ధత అంశాలపై స్పష్టమైన సూచనలు ఇవ్వడం జరిగింది. శిక్షణ సమయంలో పాటించవలసిన నియమ నిబంధనలు, ప్రవర్తనా విధానం, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించబడింది. అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసి రాష్ట్రానికి మంచి సేవలందించేలా ఆత్మవిశ్వాసం, ప్రేరణ కలిగించేలా మార్గదర్శనం చేశారు. అనంతరం, మంగళగిరిలో నిర్వహించబడిన ముఖ్యమంత్రి సందేశ కార్యక్రమంకు హాజరయ్యేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది. కాకినాడ నుండి మంగళగిరికి 13 బస్సులలో సుమారు 200 మంది అభ్యర్థులు మరియు 276 మంది తల్లిదండ్రులను సురక్షితంగా పంపించడం జరిగింది.

# కారం తమ్మన్నదొర పేరుతో జిల్లా ప్రకటించాలి

## – ఐటీడీఏ పీఓకు వినతిపత్రం ఇచ్చిన ఏపీ ఆదివాసీ జేఏసీ



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి అని రంపచోడవరం ఐటీడీఏ పీఓ బి.స్మరణ్ రాజ్ కు వినతిపత్రం ఇచ్చిన ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ పీఓ బి.స్మరణ్ రాజ్ కు (1) షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియమాకాల చట్టం ప్రకటించి కంపచోడవరం ఐటీడీ పరిధిలో ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న 309 ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఆదివాసీ పట్టాభద్రులతో ప్రత్యేక డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని అలాగే ఆదివాసీ యువతకు ఐటీడీఏ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలి, ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఇద్దరేసి ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలి, ప్రతి ఆశ్రమం పాఠశాలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని,దేవి పట్నం మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ పెద్ద భీం పల్లి 2 పెనికికల పాడు గ్రామం ఎంపీపీ పాఠశాల ప్రారంభించాలని,ఏజెన్సీలో ఉన్న ప్రతి మండలంలో మినీ జీడి పిక్కల ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలి, చిన్నారి గండి ఆర్ అండ్ ఆర్ కాలనీ మూలమెట్ట గ్రామంలో ఆరో ప్లాంటు ఏర్పాటు చేయాలి , మరియు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలి,మారుమూల గ్రామాలకు తారు రోడ్లు మంజూరు చేయాలి,శిధిల వ్యవస్థలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను తొలగించి కొత్త అంగన్వాడి బిల్డింగ్లు మంజూరు చేయాలి, ఇందుకూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలి, రంపచోడవరం కేంద్రంగా తొలి స్వతంత్ర సమరయోధుడు కారం తమ్మన్న దొర పేరుతో జిల్లా ప్రకటించాలని,ఎస్టి బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ముసురు మిల్లి ప్రాజెక్టు కాలువ ద్వారా శరభవరం దేవారం పంచాయతీల రైతులకు సాగునీరు అందించాలని, దేవీపట్నం మండలంలోని దేవారం గ్రామపంచాయతీ మరియు ఇందుకూరు గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న 11 చెరువులకు కొత్త తూములు ఏర్పాటు చేయుట గురించి,దేవారం గ్రామం వచ్చే ఆర్టీసీ బస్సు టైమింగ్స్ ఉదయం 8:30 గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని, రంపచోడవరం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని, ఆదివాసీ రైతులకు సోలార్ ఫెన్సింగ్ మరియు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ద్వారా మంజూరు చేయాలని, వెలగ పల్లి కాలువకు బ్రిడ్జి నిర్మించాలని, రంపచోడవరం కేంద్రంగా ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని మరియు ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని,కె.ఫారం ఎల్.ఫారం భూమి సమస్యలు పరిష్కరించాలని మొదలైన సమస్యలపై వినతి పత్రం అందజేశామన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పిఓ బి.స్మరణ్ రాజ్ స్పందిస్తూ త్వరలోనే అన్ని మండల కేంద్రాల్లో జీడిపిక్కల మినీ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మిగతా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్,ఏపీ ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు,ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,తెల్లం వీరా స్వామి దొర తదితరులు పాల్గొన్నారు.



# వైసిపి ఆగడాలకు అంతులేకుండా పోయింది

- చివరకు మహిళలపై కూడా దాడులా
- ఆ మధ్య కోటిపల్లి బస్టాండ్‌లో ఘర్షణపై చేసిన రాద్ధాంతం మరిచారా
- మరి ఇప్పుడు భరత్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు
- అదే మా ఎమ్మెల్యే అయితే ఇలాంటివి సహించరు
- ఎంతటి వాళ్ళనైనా పక్కన పెట్టేస్తున్నారు
- ఈవీఎం ఎమ్మెల్యే అనడంలో అర్థం ఏమిటి
- వర్తకుడుకి ఇవ్వాల్సిన రూ 15లక్షలు ఇవ్వకపోతే ఎలా
- మాజీ ఎంపీ భరత్ తీరుని విమర్శించిన దొండపాటి సత్యంబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో వైసిపి ఆగడాలు రోజురోజుకి మితి మీరిపోతున్నాయని, చివరకు మహిళపై కూడా దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సోమవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబ్బులు బాకీ అని చెప్పి రికవరీ పేరుతో మార్గాని భరత్ అనుచరులు వచ్చి ఉద్దేశ పూర్వకంగా తమ కుటుంబం మీద దాడి చేశారని మహిళలు ప్రెస్ మీట్ పెట్టి మరీ మహిళలు చెప్పారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందొ అర్థం చేసుకోవాలన్నారు. భరత్ అనుచరుడు సుభాన్ వలన తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని మహిళలు చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఇంత జరిగినా సరే, భరత్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. మరి ఆమధ్య కోటిపల్లి బస్టాండ్‌లో నలుగురో ఐదుగురో కుర్రోళ్ళు పోలీసు మీద తిరగబడితే, దానికి మా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుని బద్నామ్ చేస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన విషయం మరిచిపోయారా అని భరత్‌ని సత్యంబాబు ప్రశ్నించారు. ఎమ్మెల్యే పిఏ రౌడీ షీటరు అని, ఘర్షణలో ఉన్నాడని రాద్ధాంతం చేసారని ఆయన విమర్శించారు. ఘర్షణ జరిగిన ప్రాంతం రూరల్ పరిధిలో ఉన్నప్పటికీ తమ ఎమ్మెల్యే బాధ్యతగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఐఆర్ కట్టాలని పోలీసులకు చెప్పి చర్యలు తీసుకునేలా చేసారని సత్యంబాబు గుర్తుచేశారు. అంతే కాదు, తమ పార్టీలో ఎవరైనా అరాచకాలు చేసినట్లు తెలిస్తే, ఎమ్మెల్యే వాసు వెంటనే చర్యలు చేపడుతున్నారని, కేసులు కూడా కట్టమని చెబుతున్నారని, ఎంతపెద్దవాళ్ళైనా సరే పక్కన పెడుతున్నారని ఆయన అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెట్రేగి పోయిన బ్లేడ్ బ్యాచ్‌ని, గంజాయి బ్యాచ్‌ని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించేవారిని కూటమి ప్రభుత్వం వచ్చాక ఉక్కుపాదంతో అణిచివేస్తున్నారని సత్యంబాబు చెప్పారు. అయినా కూడా ఇంకా పెట్రేగిపోతున్నారని, వైఎస్ఆర్సిపి వాళ్ళు గ్రూపు తగాదాల పేరిట కూడా గూండాయిజం, రౌడీయిజం చేస్తూ, సిటీని చాలా దయనీయమైన స్థితికి తీసుకుపోతోన్నారని ఆయన వాపోయారు. తమ ప్రాణాలకు రక్షణ కల్పించండి మహాప్రభు అని వైఎస్ఆర్సిపి గుండాల నుంచి అని పేర్లు పెట్టి మరి చెప్పే పరిస్థితి రాజమండ్రిలో మాలాంటి సీనియర్ సిటిజన్స్‌కి, పెద్దవాళ్లకు దాపురించిందని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. పూర్వం ఎప్పుడో తమ చిన్న తనంలో విజయవాడ అని ఒకరు... ఆళ్లగడ్డ లాంటి చోట్ల రౌడీయిజం, గుండాయిజం ఉండేదని వినేవాళ్లమని, హమ్మయ్య ప్రశాంతమైన రాజమండ్రిలో ఉన్నందుకు హాయిగా ఉందని ఆనందపడేవాళ్లమని ఆయన అన్నారు. ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేవిధంగా వైసిపి వాళ్ళు వ్యవహరించడం దారుణమన్నారు. బంగారం వర్తకుడికి ఇవ్వాల్సిన రూ 15లక్షల మాటేమిటని సత్యంబాబు ప్రశ్నించారు. ఒకటికాదు రెండు కాదు ఎన్నో అరాచాకాలు బయట పడుతున్నాయన్నారు. ఎన్నికల ముందు అసెంబ్లీకి వెళ్లరు... ఎవరినీ అసెంబ్లీకి రానివ్వను, 175 మాకే అని వైసిపి వాళ్ళు విర్రవీగి చివరకు 11సీట్లకు పరిమితమయ్యారని, వాళ్ళు కూడా అసెంబ్లీకి వెళ్లడం లేదని సత్యంబాబు అన్నారు. రాజమండ్రిలో దారుణంగా ఓడిపోయినా భరత్ ఓటమికి గల కారణాలు, చేసిన తప్పులు తెలుసుకోవడం మానేసి ఈవీఎం ఎమ్మెల్యే అంటూ ఎమ్మెల్యే వాసుని విమర్శించడం తగదని ఆయన అన్నారు. గతంలో మీరు కూడా ఎంపీగా ఈవీఎం తోనే నెగ్గారు కదా, జగన్ కూడా ఈవీఎం తోనే నెగ్గారు కదా, ఇప్పటికైనా వాస్తవాలు గమనించి మాట్లాడితే మంచిదని సత్యంబాబు హితవు పలికారు. మీడియా సమావేశంలో టిడిపి నాయకులు ఉప్పులూరి జానకి రామయ్య, కదలి రామకృష్ణ,బేసరిచిన్ని, ఎం ఎన్ రావు,అనసూరి శ్రీనివాస్, స్వాతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యబద్ధంగా

# రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ఎన్నికలు జరగాలి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ఎన్నికలను ప్రజా స్వామ్యబద్ధంగా జరపాలని కోరుతూ ప్రతి సోమవారం కలక్టరేట్లో నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ (గ్రీవెన్స్)లో డివిజనల్ రెవిన్యూ అధికారి టీ.సీతారామమూర్తికి వర్కింగ్ జర్నలిస్ట్ జేఏసీ నాయకులు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో సుమారు 6సంవత్సరాలుగా ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహిచకపోగా ప్రెస్ క్లబ్ లావాదేవీలపై చర్చించకుండా, ప్రెస్‌క్లబ్ ఆస్తిని అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో కొన్నాళ్ళు పాటు ప్రెస్ క్లబ్ నిర్వహణ కొనసాగాలని అనంతరం ఆయన పర్యవేక్షణలోనే ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించాలని అభ్యర్థనలతో వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌కు సుమారు 42 మంది వర్కింగ్ జర్నలిస్టులు హాజరై ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు నిర్వహించాలని, అలాగే లావాదేవీలపై ఆడిట్ నిర్వహించాలని నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ సి. హెచ్.రాజు,వైస్ ఛైర్మన్ మారంపూడి సోమరాజు, కన్వీనర్ దుమ్ముల అబ్రహాం లింకన్, కో కన్వీనర్ వెలుగూరి రవి కుమార్, ఆర్గనైజర్ గాదె గిరీష్ కుమార్, గౌరవ సలహాదారు పొక్కులూరి రామమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ దేవులపల్లి అన్నపూర్ణ విశాలాక్షి, పోతుల వెంకటేశ్వరావు, ఇందుగల దామోదర్, సింగంశెట్టి సూర్య రాఘవేంద్ర, నమ్మి శ్రీనివాసరావు, తోటకూర పురుషోత్తం, మీడియా కో-ఆర్డినేటర్స్ మాదన వి.వి. రమేష్,కుడెల్లి రత్న కిషోర్, సభ్యులు ఎల్. బలరామ్,మురళి, ఎన్. సత్య సాయిరామ్, జి.సోమశేఖర్, నిడదవోలు సాయి, నజీర్, రాఘవ, సత్యనారాయణ, వీరబాబు, సురేష్, మహేష్, సత్యనారాయణ, మహేష్, గణేష్, దుర్గా ప్రసాద్, రాంబాబు, నాగరాజు,యాకుబ్, చిట్టిబాబు, రాఘవ, యార్లగడ్డ నరేష్ కుమార్, హరి గణేష్,తదితరులు పాల్గొన్నారు.

**సమస్య త్వరితగతిన పరిష్కరించాలి**

**డి.సి.ఓ.కి డివిజనల్ రెవెన్యూ అధికారి సూచనలు**

పాత్రికేయులు ఇచ్చిన వినతి పత్రంపై స్పందించిన డిఆర్ఓ సంభందిత ఐ అండ్ పిఆర్ అధికారి డీపీ ఆర్ ఓ లక్ష్మి నారాయణ, జిల్లా కోపరేటివ్ అధికారి వేంకట రమణ కి పిర్యాదు పత్రం గురించి వివరణ అడిగారు. అందుకు స్పందించిన అధికారి గతంలో 8 నెలల క్రితం ఫిర్యాదు చేసిన పత్రంకి ఫైలు రికార్డులు అన్ని జతపరిచామని కలెక్టర్‌కి నివేదించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. డివిజనల్ రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి మాట్లాడుతూ త్వరితగతిన ప్రెస్ క్లబ్ సమస్య పరిష్కార దిశగా కృషి చేయాలని పలు సూచనలు చేశారు. అలాగే పాత్రికేయులకు కూడా సమస్య త్వరలో పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు.

# శ్రీనివాసరావును ఘనంగా సత్కరించిన బత్తుల దంపతులు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన శివ శ్రీనివాసరాజును రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు ఘనంగా సత్కరించారు. సోమవారం విజయవాడ మంగళగిరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాసరావు(కె.కె) పలువురు జనసేన పార్టీ నాయకులు, జనసైనికుల కొలహాలతో ఘనంగా ప్రమాణ స్వీకరోత్సవం చేశారు. ఈ సందర్భంగా శివ శ్రీనివాసరాజును రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాలవేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# "టిఎల్ 2.7" నూతన చిత్ర ప్రారంభం పూజ

## కథే ఈ చిత్రానికి ప్రధాన బలం



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** వీకే సినిమా పతాకంపై రూపొందనున్న నూతన చిత్రం "టిఎల్ 2.7"ప్రారంభ పూజ కార్యక్రమం ఘనంగా, విజయవంతంగా విశాఖపట్నం శ్రీవెంకటేశ్వర స్వామిగుడి, పైడా కాలేజీ, బోయ పాలెంలో జరిగింది. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు రవితేజ తొలి క్లాప్ ఇచ్చి చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రారంభ పూజ కార్యక్రమానికి పలువురు సీనియర్ టీ.వి, సినీ రంగ ప్రముఖులు, అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కు తమ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అంతా సానుకూల వాతావరణంలో, ఉత్సాహభరితంగా కొనసాగింది. ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆర్యన్ అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కో-డైరెక్టర్‌గా పని చేస్తూ ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. పుష్ప కొండూరు సంగీత దర్శకురాలిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు & రచయిత వెంకట్ కొండూరు వీకే మాట్లాడుతూ, "టిఎల్ 2.7 ఒక పూర్తిగా విభిన్నమైన కథతో రూపొందుతున్న చిత్రం. ప్రతి వయసు ప్రేక్షకుడిని ఆకట్టుకునేలా ఈ కథ ఉంటుంది. కథే ఈ చిత్రానికి ప్రధాన బలం" అని తెలిపారు. సినీ నటులు రవితేజ చిత్ర బృందానికి నటీనటులకు అభినందనలు తెలిపారు. వీకే సినిమా సంస్థ ఈ చిత్రాన్ని ఉన్నతమైన నిర్మాణ విలువలతో తెరకెక్కించనున్నట్లు తెలిపింది. ప్రారంభ పూజతోనే మంచి వైబ్రేషన్స్ అందుకున్న ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. త్వరలోనే నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు.

# మార్గాని భరత్ ఆధ్వర్యంలో వెల్లువెత్తిన జగనన్న సైన్యం..

- కోటి సంతకాల సేకరణ పెట్టెలు తరలింపు - మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో కోటి సంతకాల సేకరణ,
- సంతకాల సేకరణ పెట్టెలు జిల్లా వైకాపా పార్టీ కార్యాలయం నుండి తాడేపల్లి కార్యాలయానికి తరలింపు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం సంతకాల సేకరణ పత్రాలను రాజమండ్రి నుండి తాడేపల్లి పార్టీ కార్యాలయమునకు పంపే కార్యక్రమంలో సిటీ పార్టీ కార్యాలయం నుంచి జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత మోరంపూడి జంక్షన్లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీగా వెళ్ళి జిల్లా పార్టీ కార్యాలయంకు చేరుకుని తదనంతరం సంతకాల సేకరణ పత్రాల వాహనాన్ని కొవ్వూరు రోడ్ కం రైలు వంతెన దాటాక తాడేపల్లి కి జగనన్న సైన్యం తరలించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ పాలనకు ప్రజల నుండి కూడా వ్యతిరేకత సుస్పష్టంగా కనపడుతుంది అని సుమారు 50000 పత్రాలను కేవలం సిటీ లోని ప్రజలతోనే సంతకాలు చేయించామని, అనూహ్య స్పందన ప్రజలు విద్యార్థులు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా వచ్చి మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయొద్దని సంతకాలు చేశారని



తెలిపారు.ఈ నెల 18వ తేదీన జగన్ గవర్నర్ ను కలుస్తారని ఈ కోటి సంతకాల పత్రాలను అందచేసి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరనున్నట్టు భరత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సిటీ పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### కోరుకొండ షీలాది గ్లోబల్ స్కూల్లో

# ఘనంగా ఫుడ్ ఫెస్ట్ ప్రోగ్రాం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శీలధి గ్లోబల్ స్కూల్‌లో చిన్నారులు నిర్వహించిన ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమం పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది. స్కూల్ కరస్పాండెంట్ గరగ లక్ష్మీపద్మావతి చంటి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమంలో పలువురు విద్యార్థిని విద్యార్థులు అనేక రకాల పిండివంటలు, పోషకాహార పదార్థాలు, పళ్లు, స్వీట్స్, అనేక రకాల బిర్యానీలు, కూరలు, చపాతీలు సుమారు100 రకాల వంట పదార్థాలను తయారుచేసి, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసి అందర్నీ అబ్బురపరిచారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆసక్తిగా తిలకించిన పలువురు ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు. స్టాల్స్ లో ఏర్పాటు చేసిన పదార్థాలను విద్యార్థులు నమూనా కరెన్సీతో రెస్టారెంట్లలో మాదిరిగానే కొనుగోలు చేసి,వినూత్న రీతిలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్ట్ అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ గణేష్, వైస్ ప్రిన్సిపల్ వై.సత్యలక్ష్మి, అకడమిక్ ఇంచార్జి జి.పద్మ, ఉపాధ్యాయులు యమున, ప్రశాంతి, లావణ్య, అలేఖ్య, సువర్ణ, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా రియల్ ఎస్టేట్

# నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం జిల్లా రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం స్థానిక ఆనంద కళా కేంద్రం వద్ద శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించారు. ఈనెల 3వ తేదీన నిర్వహించిన రాజమహేంద్రవరం జిల్లా రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో గెలుపొందిన ప్రెసిడెంట్ ఇమ్మంది కన్నారావు, సెక్రటరీగా కె.శివ రామ్ ప్రసాద్, ట్రెజరర్‌గా వి వి వి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ వి ఎస్ బాలు, జాయింట్ సెక్రెటరీ గా కుదుపూడి సురేష్, కో ట్రెజరర్‌గా కామిడీ జాన్, కార్యవర్గ సభ్యులు గా లోవరాజు, సత్యనారాయణ, ఆకుల దుర్గా కుమార్‌లను రియల్ ఎస్టేట్ వ్యవస్థాపన అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వల్లు రాజ్ లక్ష్మణ్, మావూరి సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షులు యామాన నాగేశ్వరరావు, సత్యవరపు చంద్రశేఖర్, ఎస్ కే మదీన్ భాష, కోడూరి రాజేష్, గుత్తుల బాబి వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల సత్యరాజు ఇతర రియల్ ఎస్టేట్ సభ్యులు పాల్గొన్నారు.

# ముత్తూట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన కోరుకొండలో ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో పలువురికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు కోరుకొండ బ్రాంచ్ మేనేజర్ గుర్రాల దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం కోరుకొండ ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ గుర్రాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలువురికి ఉచిత బిపి, షుగర్,రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ముత్తూట్ ఫైనాన్స్ వైద్య సిబ్బంది యు.నారాయణ, జె.గణేష్ ఉచిత వైద్యశిబిరంలో సుమారు 120 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ గణేష్, గోకవరం బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ మాగాపు దుర్గాప్రసాద్, కోరుకొండ బ్రాంచ్ సిబ్బంది సురేంద్ర, సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్, భవాని, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే బత్తుల చొరవతో

# బొబ్బిల్లంక నుండి ములకల్లంక గ్రామానికి రోడ్డు ఏర్పాటు

## హర్షం వ్యక్తం చేసిన స్థానికులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవతో బొబ్బిల్లంక గ్రామం నుండి ములకల్లంక గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేశారని కూటమి నాయకులు కంటిపూడి సత్యనారాయణ,ములకల్లంక సొసైటీ చైర్మన్ పోలిన త్రిమూర్తులు, సర్పంచ్ పోలినగోవిందరాజు, పిఎసిఎస్ డైరెక్టర్ పెంద్యాల సర్వారాయుడు, తెలుగుదేశం పార్టీ ములకల్లంక గ్రామ కమిటీ ప్రెసిడెంట్ పోలిన పృద్వి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పెంద్యాల అసన్న బాబు,తూము సత్యనారాయణ, పోలిన సీతారామయ్య, ముళ్ళపూడి కోటేశ్వరరావు అన్నారు. ఈ సంవత్సరం కురిసిన అధిక వర్షాల వలన గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో బొబ్బిల్లంక నుండి ములకల్లంక గ్రామానికి చెందిన గ్రావెల్ రోడ్డు పూర్తిగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిందని దాంతో గోదావరి ప్రవాహం తగ్గిన తరువాత రెండు గ్రామాల మధ్య రాకపోకలకు రోడ్డు అంతరాయం ఏర్పడడంతో స్థానికులు ఎమ్మెల్యే బలరామకృష్ణ దృష్టిలో పెట్టడంతో తక్షణమే స్పందించి 15 లక్షల రూపాయల వ్యయంతో 450 లారీలకు పైగా గ్రావెల్ ను రప్పించి 300 మీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని కూటమి నాయకులు అన్నారు. ఎగువ నీరు క్రిందికి వెళ్లడానికి 18 అడుగుల తూరలు 10 రోడ్డు నిర్మాణంలో ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. గోదావరి వచ్చి వెళ్లిన నాటినుండి నేటి వరకూ రోడ్డు నిర్మాణం లేక అనేక ఇబ్బందులు పడ్డామని ఇరు గ్రామాల సమస్యపై తక్షణమే ఎమ్మెల్యే స్పందించడం హర్షనీయమనివారన్నారు. రోడ్డు నిర్మాణానికి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఎంతగానో సహకరించారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలు పరిష్కరించబడుతున్నాయని అన్నారు. చిరకాల కోరిక అయిన మొదలుపెట్టి వదిలేసిన బొబ్బిల్లంక గ్రామం నుండి ములకల్లంక గ్రామానికి చెందిన బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని కోరుతున్నామని అన్నారు.

సినీ వాయిస్ CINEMA

యంగ్ లుక్ వెనుక ఉన్న

# 20 ఏళ్ల సీక్రెట్ రివీల్ చేసిన మాధవన్!



ప్రముఖ నటుడు ఆర్.మాధవన్ తన యంగ్ లుక్‌కి రహస్యం గురించి చెప్పి అందరినీ ఆశ్యర్యపరిచారు. 55 ఏళ్ల మాధవన్ ఇప్పటికీ 30%-%35 ఏళ్ల వయసు వాడిలా కనిపిస్తారు. ఆయన యంగ్ లుక్‌కి అమ్మాయిలే అబ్బాయిలు కూడా అసూయపడుతుంటారు. యంగ్ లుక్ కోసం ఏం.. ప్రముఖ నటుడు ఆర్.మాధవన్ తన యంగ్ లుక్ రహస్యం గురించి చెప్పి అందరినీ ఆశ్యర్యపరిచారు. 55 ఏళ్ల మాధవన్ ఇప్పటికీ 30%-%35 ఏళ్ల వయసు వాడిలా కనిపిస్తారు. ఆయన యంగ్ లుక్‌కి అమ్మాయిలే అబ్బాయిలు కూడా అసూయపడుతుంటారు. యంగ్ లుక్ కోసం ఏం తింటారు, ఏం చేస్తారు తెలుసుకోవాలని అందరూ ఆసక్తి చూపిస్తుంటారు. తాజాగా ఆయనకు ఎదురైన ఇదే ప్రశ్నకు ఆయన సీక్రెట్ రివీల్ చేశారు. 20 ఏళ్ల నుంచి దానినే ఫాలో అవుతున్నానంటూ మాధవన్ చెప్పిన సీక్రెట్ అందరిని ఆశ్చర్యపరిచింది. తన యంగ్ లుక్ సీక్రెట్ ఆయుర్వేద విధానాలే అని తెలిపారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, బొటక్స్ లేదా ఫిల్లర్స్ వంటి కాస్మెటిక్ ట్రీట్‌మెంట్స్‌కు దూరంగా ఉంటూ నేచురల్ దొరికే వాటినే వాడుతానని చెప్పారు. "నా రొటీన్ చాలా సింపుల్. చిన్నప్పటి నుంచే ప్రతి ఆదివారం నూనె స్నానం చేస్తాను. సెసమీ ఆయిల్‌తో శరీరమంతా, ముఖ్యంగా తలకు రాసుకుని స్నానం చేస్తాను. మిగతా రోజుల్లో కొబ్బరి నూనె ఉపయోగిస్తాను" అని మాధవన్ తెలిపారు. ఈ ఆయుర్వేద పద్ధతిని 20 ఏళ్లకు పైగా అనుసరిస్తున్నట్లు పేర్కొన్నారు. చర్మ సంరక్షణకు కూడా సహజ మార్గాలే తన ఎంపిక అని చెప్పారు మాధవన్. 'ఉదయం నిద్ర లేచిన వెంటనే సూర్యకిరణాలు తనపై పడేలా గోల్ఫ్ ఆడుతానన్నారు. సన్‌టాన్ అవుతాను కానీ, చర్మం టైట్ అయి ముడతలు రాకుండా ఉంటుంది. ఫిల్లర్స్ లేదా ఎన్‌హాన్స్‌మెంట్స్ ఏం చేయించలేదు. అప్పుడప్పుడు రోల్ కోసం ఫేషియల్ చేస్తాను. కేవలం కొబ్బరి నూనె, కొబ్బరి నీళ్లు, సూర్యకాంతి, శాఖాహారమే నా చర్మాన్ని కాపాడుతున్నాయి' అని అన్నారు. తాను శాఖాహారినని, ఇంట్లో వండిన తాజా ఆహారాన్నే ఇష్టపడతానని మాధవన్ చెప్పారు. ప్రాసెస్డ్ ఫుడ్, ఆల్కహాల్‌కు దూరంగా ఉంటానని తెలిపారు. ఈ సహజ జీవనశైలి వల్లే 55 ఏళ్ల వయసులో కూడా యవ్వనంగా కనిపిస్తున్నానని ఆయన అభిప్రాయపడ్డారు. అభిమానులు మాధవన్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌ను ఎప్పుడూ పొగుడుతూనే ఉంటారు. ఏజింగ్‌ను సహజంగా ఆనందిస్తానని, దాన్ని దాచడానికి ప్రయత్నించనని ఎప్పుడూ చెప్తారు. ఈ ఆయుర్వేద రొటీన్‌తోనే ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంటున్నానని స్పష్టం చేశారు.

# శృతిహాసన్ టు మౌనీ రాయ్..

## ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్న స్టార్లు వీళ్లే!



సినిమా అనేది గ్లామర్ వరల్డ్. అందంగా ఉన్న వాళ్లకు మాత్రమే ఇక్కడ అవకాశాలు లభిస్తాయి. అందుకే అందంగా ఫిట్‌నెస్, ఫుడ్‌తోపాటు కొన్నిసార్లు ప్లాస్టిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు సెలబ్రిటీలు. ఈ కల్చర్ ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ.. కొన్నేళ్ల నుంచి సర్జరీ చేయించుకుని తమ అందానికి.. సినిమా అనేది గ్లామర్ వరల్డ్. అందంగా ఉన్న వాళ్లకు మాత్రమే ఇక్కడ అవకాశాలు లభిస్తాయి. అందుకే అందంగా ఫిట్‌నెస్, ఫుడ్‌తోపాటు కొన్నిసార్లు ప్లాస్టిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు సెలబ్రిటీలు. ఈ కల్చర్ ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ.. కొన్నేళ్ల నుంచి సర్జరీ చేయించుకుని తమ అందానికి మరిన్ని మెరుగులు దిద్దుకునేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు నేటి తారలు. హీరోయిన్లు మాత్రమే ఎక్కువగా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటున్నారని టాక్. స్టార్ ఇమేజ్ ఉన్నప్పటికీ దానిని మరింత పెంచుకునేందుకు తమ అందానికి మెరుగులు దిద్దుకోవడానికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్న స్టార్లు ఎవరు అనేది తెలుసుకుందాం..

**ప్రియాంక చోప్రా - బాట్చ్ నోస్ సర్జరీ**

మిస్ వరల్డ్ కిరీటం అందుకున్న తర్వాత నాసల్ పాలిప్ తొలగించే సర్జరీలో డాక్టర్ మిస్టేక్ చేశారు. దీంతో ముఖం పూర్తిగా మారిపోయింది. దాంతో మూడు సినిమా అవకాశాలు కోల్పోయింది. 'డీప్ డిప్రెషన్‌లోకి వెళ్లాను. కెరీర్ అయిపోయిందని అనుకున్నాను' అని ప్రియాంక పలు మార్లు చెప్పింది. తర్వాత కరెక్టివ్ సర్జరీలతో సరిచేసుకుంది.

**అనుష్క శర్మ - లిప్ జాబ్ ట్రోలింగ్**

'బాంబే వెల్వెట్' కోసం లిప్ ఎన్‌హాన్స్‌మెంట్ చేయించుకున్న అనుష్కకు పెదాలు పఫ్ఫీగా మారాయి. కాఫీ విత్ కరణ్ షోలో కనిపించినప్పుడు భారీ ట్రోలింగ్ ఎదురైంది. తర్వాత "టెంపరరీ టూల్ వాడాను" అని చెప్పినా, లిప్ జాబ్ అని అందరూ అనుకున్నారు.

**అయేషా టకియా - ఓవర్‌డన్ లిప్ ఫిల్లర్స్**

'వాంటెడ్' బ్యూటీ ఐషా లిప్ ఫిల్లర్స్, చీక్ ఎన్‌హాన్స్ మెంట్స్ చేయించుకుంది. దీంతో పెదాలు అన్‌నేచురల్‌గా పఫ్ఫీ అయ్యాయి. ముఖం పూర్తిగా మారిపోయింది. సోషల్ మీడియాలో భారీ ట్రోలింగ్ ఎదుర్కొంది.

**రాఖీ సావంత్ - మల్టిపుల్ సర్జరీలు**

రాఖీ బ్రెస్ట్ ఇంప్లాంట్స్, లిప్, నోజ్ సర్జరీలు చేయించు కున్నానని ఓపెన్‌గా చెప్పింది. "భగవాన్ ఇవ్వనిది డాక్టర్ ఇచ్చాడు" అని తెలిపింది కూడా. అన్‌నేచురల్ లుక్ వల్ల విమర్శలు ఎదుర్కొంది.

**కోయెనా మిత్ర - నోజ్ జాబ్ డిజాస్టర్**

'సాకి సాకి' గర్ల్ కోయెనా 2010లో రైనోప్లాస్టీ (నోజ్ సర్జరీ) చేయించుకుంది. సర్జరీ తప్పుగా జరిగి ఎముకలు వాచిపోయాయి, ముక్కు ఆకారం పూర్తిగా మారిపోయింది. మరో సర్జరీ చేయించుకోవాల్సి వచ్చింది. దీంతో కెరీర్ దెబ్బతింది. ఇండస్ట్రీ నుంచి దూరమైంది. ఒక ఇంటర్వ్యూలో "3 ఏళ్లు టార్చర్ అనుభవించాను" అని చెప్పింది కోయెనా.

**శ్రుతి హాసన్ - నోస్ జాబ్ & ఫిల్లర్స్**

తన ప్లాస్టిక్ సర్జరీల గురించి ఓపెన్‌గా మాట్లాడిన కొద్ది మంది సెలబ్రిటీల్లో ఒకరు శ్రుతి హాసన్. మొదటి సినిమా తర్వాత నోస్ బ్రేక్ అయినందున రైనోప్లాస్టీ చేయించుకుంది. "నా ముక్కు బ్రోకెన్, దాన్ని ప్రెట్టీగా మార్చుకున్నాను. ఇది నా ముఖం, నా ఛాయిస్" అని చెప్పింది. ఫిల్లర్స్ కూడా వాడినట్లు తెలిపింది. చాలామంది ఆమె సర్జరీని సక్సెస్‌ఫుల్‌గా చూస్తారు. మరింత అందంగా కనిపిస్తోందని పొగుడుతారు.

**మౌనీ రాయ్ - ఓవర్ ఫిల్లర్స్ & ఇతర ప్రొసీజర్స్**

టీవీ నుంచి బాలీవుడ్‌కు వచ్చిన మౌనీ రాయ్ రూపంలో మార్పు గురించి ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంటుంది. లిప్ ఫిల్లర్స్, చీక్ ఎన్‌హాన్స్‌మెంట్, బోటాక్స్ ఎక్కువ చేయించుకున్నట్లు రూమర్స్ ఉన్నాయి. ముందు సింపుల్ లుక్‌లో ఉండేది. ఇప్పుడు అన్‌రికగ్నైజబుల్‌గా మారిందని ట్రోలింగ్ ఎదురవుతుంటాయి. మౌనీ ఈ ఆరోపణలను డినై చేస్తుంది.

**ప్రీతి జింటా - బోటాక్స్ & ఇతర ఎన్‌హాన్స్‌మెంట్స్**

డింపుల్ బ్యూటీ ప్రీతి జింటా బోటాక్స్, ఫేస్ లిఫ్ట్, చీక్ ఫిల్లర్స్ చేయించుకున్నట్లు రూమర్స్ ఉన్నాయి. ముందు బబ్లీ లుక్‌లో ఉండేది. ఇప్పుడు ముఖం టైట్‌గా, అన్‌నేచురల్‌గా కనిపిస్తోందని ట్రోలింగ్స్ ఎదుర్కొంటుంది ఈ బ్యూటీ.

క్రీడా వాయిస్

# మళ్లీ భారత్‌కు వస్తారా..?

## టీ20 వరల్డ్ కప్ టికెట్‌ను మెస్సీకి బహూకరించిన ఐసీసీ చైర్మన్ జై షా



ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ప్రస్తుతం తన GOAT టూర్?లో భాగంగా భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో ఆయన కలకత్తా, హైదరాబాద్, ముంబై నగరాలను సందర్శించారు. ఈ టూర్‌లో మూడవ, చివరి రోజున ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఒక కార్యక్రమంలో, ఐసీసీ చైర్మన్ జై షా మెస్సీని కలిశారు. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ప్రస్తుతం తన GOAT టూర్?లో భాగంగా భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో ఆయన కలకత్తా, హైదరాబాద్, ముంబై నగరాలను సందర్శించారు. ఈ టూర్‌లో మూడవ, చివరి రోజున ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఒక కార్యక్రమంలో, ఐసీసీ చైర్మన్ జై షా మెస్సీని కలిశారు. వచ్చే ఏడాది భారత్‌లో జరగనున్న టీ20 వరల్డ్ కప్ 2026 మ్యాచ్ టికెట్‌ను జై షా మెస్సీకి బహూకరించడం విశేషం.

**మెస్సీకి టీ20 వరల్డ్ కప్ టికెట్**

ఐసీసీ చైర్మన్ జై షా మెస్సీకి భారత్, యూఎస్ఏ మధ్య జరగబోయే టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ టికెట్‌ను ప్రత్యేకంగా అందించారు. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 7వ తేదీన జరగనుంది. తద్వారా మెస్సీ ఈ మ్యాచ్ చూడటానికి తిరిగి భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జై షా, మెస్సీకి భారత టీ20 వరల్డ్ కప్ జెర్సీని కూడా బహుకరించారు. ఈ సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాతో పాటు, మెస్సీ సహచర ఆటగాళ్లు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ కూడా అక్కడే ఉన్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది.

**ఢిల్లీలో మెస్సీ సందడి**

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మెస్సీ, సువారెజ్, డి పాల్‌తో కలిసి పిల్లలతో ఫుట్‌బాల్ ఆడారు. ఆ తర్వాత అక్కడ ఒక ప్రదర్శన మ్యాచ్ కూడా జరిగింది. మినర్వా మెస్సీ ఆల్‌స్టార్స్ టీమ్, సెలబ్రిటీ మెస్సీ ఆల్‌స్టార్స్ టీమ్‌పై 6–0 తేడాతో విజయం సాధించింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి దాదాపు 22,000 మంది ప్రేక్షకులు మైదానంలో హాజరయ్యారు. వారంతా మెస్సీ, మెస్సీ అని నినాదాలు చేశారు. మెస్సీ, సువారెజ్, డి పాల్ మైదానం చుట్టూ తిరిగి అభిమానులకు అభివాదం చేశారు. బాల్స్‌ను ప్రేక్షకుల వైపు విసిరి మరింత ఉత్సాహపరిచారు.

# వైభవ్ సూర్యవంశీ ఎఫెక్ట్..

## ఎవరికీ తెలియని ఈ ఐదుగురిపై కోట్లు పెడితే కప్పు గ్యారంటీ



ఐపీఎల్ 2026 వేలంలో యువ ఆటగాళ్లపై భారీగా నోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. వీరు బయటి ప్రపంచానికి పెద్దగా తెలియకపోయినా, వారిలో భవిష్యత్తులో స్టార్ ప్లేయర్‌లు అయ్యేంత కెపాసిటీ ఉంది. గత వేలంలో వైభవ్ సూర్యవంశీకి ఊహించని ధర పలికినట్లే, ఈసారి కూడా అలాంటి అనామక ఆటగాళ్లపై కోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఐపీఎల్ 2026 వేలంలో యువ ఆటగాళ్లపై భారీగా నోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. వీరు బయటి ప్రపంచానికి పెద్దగా తెలియకపోయినా, వారిలో భవిష్యత్తులో స్టార్ ప్లేయర్‌లు అయ్యేంత కెపాసిటీ ఉంది. గత వేలంలో వైభవ్ సూర్యవంశీకి ఊహించని ధర పలికినట్లే, ఈసారి కూడా అలాంటి అనామక ఆటగాళ్లపై కోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ యువ ఆటగాళ్లలో 150 కి.మీ వేగంతో బౌలింగ్ చేసే ప్లేయర్‌తో పాటు విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ, కేకేఆర్ వంటి టీమ్స్‌ను ఆకట్టుకున్న ఆటగాళ్లు కూడా ఉన్నారు. ఆ ఐదుగురు ప్లేయర్స్, వారి ప్రత్యేకతలు ఏంటో చూద్దాం.

1. కరణ్ లాల్ – బెంగాల్

బెంగాల్‌కు చెందిన 25 ఏళ్ల బ్యాట్స్‌మన్ కరణ్ లాల్ ఈ ఐపీఎల్ వేలంలో మంచి ధర దక్కించుకోవచ్చు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ లో ఈ ఆటగాడు కేవలం 50 బంతుల్లో 113 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ఆ తర్వాత ఆర్‌సీబీ ట్రయల్స్‌కు వెళ్లినప్పుడు, అక్కడ 17 బంతుల్లోనే 54 పరుగులు చేశాడు. సుయష్ శర్మ ఓవర్‌లో రెండు, నవదీప్ సైనీ ఓవర్‌లో మూడు సిక్సర్లు కొట్టి, టీమ్స్ దృష్టిని ఆకర్షించాడు.

2. కార్తీక్ శర్మ – రాజస్థాన్

రాజస్థాన్‌కు చెందిన వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ కార్తీక్ శర్మపై కూడా భారీగానే పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. ఈ ఆటగాడు వికెట్ కీపర్‌గా ఉండటంతో పాటు, ఫినిషర్ పాత్రను కూడా చక్కగా పోషిస్తాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఐదు ఇన్నింగ్స్‌లలో 133 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 160 కంటే ఎక్కువగా ఉంది. ఈ విధ్వంసక హిట్టర్‌ను ఇటీవల రవిచంద్రన్ అశ్విన్, ఆకాశ్ చోప్రా వంటి దిగ్గజాలు కూడా ప్రశంసించారు.

3. అశోక్ శర్మ – రాజస్థాన్

రాజస్థాన్‌కు చెందిన మరో ఆటగాడు అశోక్ శర్మ డిమాండ్ కూడా ఎక్కువగా ఉంది. ఈ ఫాస్ట్ బౌలర్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఏకంగా 20 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా అశోక్ శర్మ వేగం 145 కి.మీ/గం కంటే ఎక్కువగా ఉండి, కొన్నిసార్లు 150 కి.మీ/గం మార్కును కూడా చేరుకుంటాడు. అతని స్పీడు లక్నో, చెన్నై వంటి జట్లకు బాగా ఆకర్షణీయంగా ఉంటుంది.

4. తుషార్ రమేశ్ రెహేజా – తమిళనాడు

తమిళనాడుకు చెందిన మరో వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ తుషార్ రమేశ్ రెహేజా కూడా ఐపీఎల్ 2026 వేలంలో మంచి బిడ్ దక్కించుకోవచ్చు. ఈ స్టార్ ఆటగాడు ప్రస్తుత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 7 మ్యాచ్‌లలో 151 పరుగులు చేశాడు, అతని స్ట్రైక్ రేట్ 164.13గా ఉంది. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా అతని దూకుడు, ముఖ్యంగా ఢిల్లీ క్యాపిటల్స్ వంటి టీమ్‌లకు ప్రయోజనం చేకూర్చవచ్చు.

5. ఆకిబ్ నబీ – జమ్మూ కాశ్మీర్

జమ్మూ-కాశ్మీర్‌కు చెందిన ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ నబీపై కూడా భారీ డబ్బు కురిసే అవకాశం ఉంది. ఈ రైట్ ఆర్మ్ పేసర్ రంజీ ట్రోఫీ నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ వరకు అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఆకిబ్ నబీ త్వరలోనే టీమిండియాలో కూడా కనిపించవచ్చని అంచనా ఉంది. ఈ టాలెంటెడ్ ఆటగాడి కోసం అనేక ఐపీఎల్ టీమ్స్ పోటీ పడవచ్చు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com